కార్తికం.. ఆర్టీసీ ప్రత్యేక యాత్ర బస్సులు


వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం): కార్తిక మాసంలో పుణ్యక్షేత్రాలను సందర్శించే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక యాత్ర బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ జిల్లా ప్రజారవాణా అధికారిణి(డీపీటీవో) షర్మిలా అశోక, రాజమహేంద్రవరం డిపో మేనేజర్(డీఎం) ఎస్.కె.షబ్నం తెలిపారు. రాజమహేంద్రవరంలోని డీపీటీవో కార్యాలయం వద్ద పంచారామాలు, శబరిమలై యాత్ర బస్సులకు సంబంధించిన ప్రచార గోడ పత్రికలను ఆర్టీసీ అధికారులు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీపీటీవో, డీఎం మాట్లాడుతూ కార్తికమాసాన్ని పురస్కరించుకుని వచ్చే నెలలో రాజమహేంద్రవరం డిపో నుంచి పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక యాత్ర బస్సులు నడపనున్నట్లు తెలిపారు. నవంబరు 3, 10, 17, 24, డిసెంబరు 1 తేదీల్లో ప్రతి ఆదివారం రాత్రి ఏడు గంటలకు ఇక్కడి నుంచి భక్తులతో ఈ సర్వీసులు బయలుదేరి సోమవారాల్లో పంచారామ (అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామ, సామర్లకోట) క్షేత్రాలను దర్శించి తిరిగి అదేరోజు సాయంత్రానికి డిపోనకు చేరుకుంటాయని తెలిపారు. వీటికి టికెట్ రిజర్వేషన్ సౌకర్యం ఉంటుందన్నారు. ◗ శబరిమలై యాత్రకు వెళ్లే అయ్యప్పభక్తుల కోసం 5, 7, 10 రోజుల యాత్ర పేరిట ప్రత్యేక ప్యాకేజీ బస్సులను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్(ట్రాఫిక్), స్టేషన్ మేనేజర్ త్రిమూర్తులు, జనరల్ ఏడీసీ కుమార్, ఓపీఆర్ఎస్ ఇన్‌ఛార్జి రియాజ్ తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ అధికారులు



వేంకటేశ్వరస్వామి శేషవాహన సేవలో భక్తులు





కళాకారుల డప్పు వాయిద్యం

కాంతులీనుతున్న వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం

వెంకన్న బ్రహ్మోత్సవం.. భక్తజన సంబరం

వాడపల్లి(ఆత్రేయపురం), న్యూస్‌టుడే: గోవింద నామస్మరణలు మిన్నంటిన వేళ వాడపల్లి వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ఉదయం ప్రారంభమయ్యాయి. పండితులు ఖండవిల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు నేతృత్వంలో అంకురార్పణ చేశారు. శుభముహూర్తంలో ధ్వజారోహణ నిర్వహించారు. గరుడ పటాన్ని ఊరేగించి బ్రహ్మాది దేవతలను ఉత్సవాలకు ఆహ్వానిస్తూ శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి సమక్షంలో ఎగురవేశారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, కార్యనిర్వహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు తదితరులు మూలమూర్తికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఏడు పడగల ఆదిశేషునిపై రాత్రి ఉభయ దేవేరులతో పరావాసుదేవ అలంకారంలో స్వామి ఊరేగారు. ● మంగళవారం అష్టదళ పాదపద్మారాధన, సరస్వతి అలంకరణలో హంసవాహన సేవ ఉంటాయి.



ప్రాథమిక విద్యకు పూర్వ వైభవం

జీవో 117 రద్దు నిర్ణయంపై సర్వత్రా హర్షం

న్యూస్‌టుడే, పామర్రు

విద్య పునర్ వ్యవస్థీకరణ పేరిట వైకాపా సర్కారు తెచ్చిన జీవో 117తో విద్యారంగం కుదేలైంది. సర్కారు అనాలోచిత చర్యలతో ముఖ్యంగా ప్రాథమిక విద్య విధ్వంసానికి గురైంది. ప్రాథమిక పాఠశాలలు కళావిహీనంగా మారాయి. ఈ పరిస్థితి చక్కదిద్దాలని ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రుల వినతి మేరకు కూటమి సర్కారు చర్యలు చేపట్టడంతో అంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

10+2 విద్య నిర్మాణ స్థానంలో 5+3+3+4 విద్యావిధానాన్ని (ఎన్ఈపీ) తీసుకొచ్చింది. దీనికోసం వైకాపా సర్కారు జీవో.117తో 3, 4, 5 తరగతులను విలీన ప్రక్రియ చేపట్టింది. ఉమ్మడి జిల్లాలో 368 పాఠశాలల్లో 1, 2 తరగతులు మాత్రమే మిగిలిపోయాయి. 3, 4, 5 తరగతులవారు ఉన్నత పాఠశాలలకు వెళ్లాలంటే దూరాభారంతో ఇబ్బందిపడ్డారు. సుమారు 910 మంది విద్యార్థులు డ్రాపౌట్లుగా మిగిలిపోయారు. 3, 4, 5 తరగతుల వారికి స్కూల్ అసిస్టెంట్లతోనే బోధన చేయిస్తామని వైకాపా సర్కారు ప్రగల్భాలు పలికింది. ఉమ్మడి జిల్లాలో 1,215 వరకూ టీచర్లను సర్దుబాటు చేయాల్సి వచ్చింది. దీంతో గందరగోళం తలెత్తింది. ప్రాథమిక పాఠశాలల్లో ఏకోపాధ్యాయ బడుల సంఖ్య బాగా పెరిగిపోయింది.

● **విలీనంతో ఎన్నో అవస్థలు**

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 368 ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, 5 తరగతులను సమీపంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో గత సర్కారు విలీనం చేసింది. దీనివల్ల సుమారు 911 పాఠశాలల్లో పది మందిలోపే విద్యార్థులు మిగిలారు. 126 పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఒక్కరూ చేరలేదు. సున్నా సంఖ్య ఉన్న పాఠశాలలు ఉమ్మడి జిల్లాలో 15 వరకూ ఉన్నాయి.

● **ఇచ్చిన హామీ నెరవేర్చి..**

అధికారంలోకి వచ్చిన వెంటనే జీవో 117 రద్దు చేస్తామని కూటమి నాయకులు హామీఇచ్చారు. చెప్పినట్టే విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్.. ఈ జీవోను వచ్చే విద్యాసంవత్సరం నుంచి రద్దు చేస్తామని ప్రకటించారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తమవుతోంది.

● **ఇదీ ప్రయోజనం**

◆ జీవో 117 రద్దుతో ప్రాథమిక పాఠశాలలకు పూర్వ వైభవం వస్తుంది. ◆ విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయుల నియామకానికి జీవో 53 అమలవుతుంది. ◆ 98 మంది కంటే తక్కువ రోల్ ఉన్న ఉన్నత పాఠశాలలకు జీవం వస్తుంది. ప్రాథమికోన్నత పాఠశాలలకు సబ్జెక్టులవారీ ఉపాధ్యాయులు వస్తారు.

నిర్ణయం సముచితం



జీవో నంబరు 117 కష్టనష్టాలను అధికారులు, అప్పటి నేతలకు చెప్పినా పట్టించుకోకుండా అమలు చేశారు. కేవలం ప్రపంచ బ్యాంకు నిధుల రాకకోసమే ఇలా చేశారన్నది నగ్న సత్యం. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సముచితంగా ఉంది.

- పీవీఎన్.సూర్యనారాయణ, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, అనపర్తి

దళిత యువకుడి హత్యకేసులో..

మాజీ మంత్రి విశ్వరూప్ కుమారుడు అరెస్టు

ఈనాడు, రాజమహేంద్రవరం; న్యూస్‌టుడే: అమలాపురం పట్టణం, పి.గన్నవరం: అయినవిల్లికి చెందిన వాలంటీరు జనుపల్లి దుర్గాప్రసాద్ హత్య(2022 జూన్ 6) కేసులో సూత్రధారైన మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ కుమారుడు శ్రీకాంత్‌ను మధురైలో ఆదివారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తిరువణ్ణామలైలో ఉన్నట్లు తెలియడంతో పోలీసులు అక్కడికి చేరుకోగా.. శ్రీకాంత్ పరారై మధురై చేరుకున్నట్లు సమాచారం. అక్కడ పట్టుకున్నట్లు తెలుస్తోంది. 'నేనో డాక్టర్‌ను.. ప్రాణాలు కాపాడడమే గాని.. తీయడం రాదు.. అక్రమంగా ఇరికిస్తున్నారంటూ శ్రీకాంత్ వ్యాఖ్యానించారు. వైద్య పరీక్షలు నిర్వహించి, సోమవారం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచి, రోడ్డు మార్గంలో ఇక్కడకు తీసుకొస్తున్నారు. ■ ముమ్మిడివరానికి చెందిన వైకాపా నాయకుడు కాశీ రామకృష్ణ, మరో ముగ్గురినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హత్య కేసు నిందితులతో ఎక్కువగా ఫోన్లో మాట్లాడినట్లు గుర్తించిన నేపథ్యంలో విచారిస్తున్నట్లు తెలుస్తోంది.



అక్రమంగా తనను ఇరికిస్తున్నారంటూ మధురైలో వ్యాఖ్యానిస్తున్న శ్రీకాంత్

సాగునీటి సంఘాలకు పచ్చజెండా

ఎన్నికలకు ప్రకటన విడుదల

ఈనాడు, రాజమహేంద్రవరం; న్యూస్‌టుడే, వి.ఎల్.పురం: అయిదేళ్ల వైకాపా పాలనలో గాలికొదిలేసిన సాగునీటి పారుదల వ్యవస్థను గాడిన పెట్టేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆయా ఆయకట్టు పరిధిలో కాలువల నిర్వహణ, ఇతర బాధ్యతల పర్యవేక్షణలో కీలకంగా వ్యవహరించే సంఘాల ఎన్నికల నిర్వహణకు పచ్చజెండా ఊపింది. తూర్పుగోదావరి, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల కలెక్టర్లు సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారని జలవనరులశాఖ ఎస్ఈ శ్రీనివాసరావు తెలిపారు.

ప్రక్రియ ఇలా..

కాలువల ఆయకట్టు ఆధారంగా ప్రాదేశిక (టెరిటోరియల్) నియోజకవర్గాల వారీ ఆయకట్టు నిర్ధారణ, ఓటర్ల జాబితాలను సిద్ధం చేసి.. 12 టీసీలను ఎన్నుకుంటారు. వీరిలోనే సాగునీటి వినియోగదారుల సంఘానికి (డబ్ల్యుయూఏ) అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకుంటారు. డబ్ల్యుయూఏలు డీసీలు (డిస్ట్రిబ్యూటరీ కమిటీ), డీసీలు ప్రాజెక్టు కమిటీలను ఎన్నుకుంటాయి. గతంలో గోదావరి డెల్టా పరిధిలో ఒకటే ప్రాజెక్టు కమిటీ ఉండేది. ప్రస్తుతం తూర్పు, మధ్య డెల్టాలకు వేర్వేరుగా కమిటీల ఎన్నిక జరగనుంది.

ఇదీ పరిస్థితి..

ఉమ్మడి జిల్లాలో గోదావరి డెల్టా సిస్టమ్, ఏలేరు ఇరిగేషన్ (వైఐ) డివిజన్, ఏలేరు ప్రాజెక్టు, తొర్రిగడ్డ పంపింగ్ స్కీం, పంపా రిజర్వాయర్, సుబ్బారెడ్డి సాగర్, మైనర్ ఇరిగేషన్ పరిధిలో 401 సాగునీటి సంఘాలు, 30 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు (డీసీ), 5 ప్రాజెక్టు కమిటీలు (పీసీ) ఉన్నాయి.

గోదావరి డెల్టా సిస్టమ్ (జీడీఓస్)	◗ మధ్య డెల్టాలో సాగునీటి వినియోగదారుల సంఘాలు (డబ్ల్యుయూఏ): 56
తూర్పు డెల్టా	◗ 74 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు (డీసీ): 25 ◗ ప్రాజెక్టు కమిటీలు: 2
ఏలేరు ప్రాజెక్టు	◗ సంఘాలు: 25 ◗ డిస్ట్రిబ్యూటరీ కమిటీలు: 5 ◗ ప్రాజెక్టు కమిటీ: 1
తొర్రిగడ్డ పంపింగ్ పథకం	◗ వినియోగదారుల సంఘాలు: 04 ◗ ప్రాజెక్టు కమిటీ: 01
పంపా రిజర్వాయర్	◗ సంఘాలు: 06 ◗ ప్రాజెక్టు కమిటీ: 01
సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టు	◗ సంఘాలు: 06 ◗ ప్రాజెక్టు కమిటీ: 01
సూక్ష్మ నీటిపారుదల వ్యవస్థ	◗ సంఘాలు: 216 ఏలేరు నీటిపారుదల డివిజన్ (పెద్దాపురం): ◗ సంఘాలు: 14

113 సంఘాల్లో సందడి

తూర్పుగోదావరి జిల్లాలోని 113 నీటి యాజమాన్య సంఘాల ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్-1 విడుదల చేసినట్లు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. ఓటర్ల జాబితా సిద్ధం చేసేందుకు ప్రతి మండలానికి నీటి వినియోగదారుల సంఘం(డబ్ల్యుయూఏ) పరిధిలో సంబంధిత తహసీల్దారును ఆథరైజ్డ్ అధికారిగా, ఆయకట్టు వివరాలు సరిచూసేందుకు సంబంధిత నీటిపారుదల శాఖ తరపున అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ అధికారిని నియమించినట్లు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు.

సిబ్బంది అరకొర.. నేరాల కట్టడి ఎలా?

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

రైలు ప్రయాణికులకు భద్రత కల్పించడంతోపాటు నేరాలు నియంత్రించడంలో కీలకంగా వ్యవహరించే గవర్నమెంట్ రైల్వే పోలీసులు(జీఆర్పీ)లో సిబ్బంది కొరత వెంటాడుతూనే ఉంది. ఉన్న సిబ్బందిపై భారం పెరగడమేకాక అవసరానికి సెలవులు కూడా దొరకక కిందిస్థాయి సిబ్బంది సతమతమవుతున్నారు. స్టేషన్ల పరిధిలో పూర్తి పర్యవేక్షణతోపాటు పలు చోరీ కేసుల దర్యాప్తు త్వరితగతిన ముందుకు సాగని పరిస్థితి నెలకొంది.



రాజమహేంద్రవరం జీఆర్పీ స్టేషన్

ఖాళీగా 22 పోస్టులు: ఇక్కడి జీఆర్పీ స్టేషన్‌లో మొత్తం 53 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా 22 పోస్టులు కొంతకాలంగా ఖాళీగానే ఉన్నాయి.

రాజమహేంద్రవరం జీఆర్పీ స్టేషన్ పరిధిలో ఇక్కడి ప్రధాన రైల్వేస్టేషన్‌తో కలిపి అయిదు స్టేషన్లున్నాయి. ఇటు గోదావరి రైల్వేస్టేషన్ నుంచి అటు ద్వారపూడి వరకు శాంతిభద్రతల పర్యవేక్షణ, నేరాల నియంత్రణ బాధ్యతలు ఇక్కడి జీఆర్పీ సిబ్బంది చూడాల్సి ఉంటుంది. ముఖ్యంగా రైళ్ల హాల్టు, ప్రయాణికులు రాకపోకలు ఎక్కువగా ఉండే ప్రధాన రైల్వేస్టేషన్‌తోపాటు నగరం మధ్యలోని గోదావరి స్టేషన్‌లో మూడు షిఫ్టులుగా నిరంతర గస్తీ నిర్వర్తించాల్సి ఉంటుంది. సిబ్బంది కొరత కారణంగా ప్రధాన స్టేషన్‌లో షిఫ్టునకు ముగ్గురు, గోదావరి స్టేషన్ వద్ద ఇద్దరిని విధులకు కేటాయిస్తున్నారు.

జీఆర్పీలో ఇదీ పరిస్థితి

38 కేసుల్లో 31 పెండింగ్

ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు 30 వరకు ఇక్కడి జీఆర్పీ స్టేషన్‌లో మొత్తం 38 చోరీ కేసులు నమోదయ్యాయి. రైలు ప్రయాణికులకు సంబంధించి మొత్తం రూ.21.16 లక్షల సొత్తు చోరీకి గురైంది. ఇప్పటివరకు ఏడు కేసుల్లో రూ.4.39 లక్షలు మాత్రమే రికవరీ చేయగలిగారు. సిబ్బంది కొరత కారణంగా మరో 31 చోరీ కేసుల దర్యాప్తు వేగవంతం చేయలేని పరిస్థితి. కొన్ని కీలక కేసుల్లో రైల్వే రక్షక దళం(ఆర్పీఎఫ్) సిబ్బంది సహకారం తీసుకుంటే తప్ప ఛేదించలేని పరిస్థితి.

ఉండాల్సిన సిబ్బంది

❖ ఇన్‌స్పెక్టర్ ❖ ఇద్దరు ఎస్సైలు ❖ ఏఎస్సై ❖ ఆరుగురు హెచ్‌సీలు ❖ 43 మంది కానిస్టేబుళ్లు. ❖ ప్రస్తుతం ఏఎస్సై, 21 మంది కానిస్టేబుళ్ల పోస్టులు ఖాళీగా ఉండటం సమస్యగా మారింది. ఉన్న సిబ్బందే రైళ్లలో, ప్లాట్‌ఫామ్‌పై గస్తీ, ఎస్కార్ట్ విధులకే సరిపడక.. చోరీలు ఇతర నేరాలకు సంబంధించి కేసుల దర్యాప్తు సాగించలేని పరిస్థితి. పోస్టుల భర్తీకి గత ప్రభుత్వం హయాంలోనే ప్రతిపాదనలు పంపినా ఫలితం లేక ఉన్న సిబ్బందితోనే నెట్టుకొస్తున్నారు.

నిఘా పెంచాల్సిందే...

దీపావళి, క్రిస్మస్, సంక్రాంతి ఇలా వరస పండగల సీజన్ కావడంతో రైళ్లలో ప్రయాణికుల రద్దీతోపాటు నేరాలూ పెరిగే అవకాశం ఉంటుంది. నేరాల కట్టడికి మరింత పటిష్ఠం చేసేందుకు జీఆర్పీలో సిబ్బందిని పెంచాల్సిన అవసరం ఉంది. దీనిపై జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాస్ మాట్లాడుతూ సిబ్బంది కొరత విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రస్తుతానికి ఇబ్బంది లేకుండా ఆర్పీఎఫ్ సిబ్బంది సహకారంతో నిఘా వ్యవస్థను పటిష్ఠం చేశామన్నారు.



రైతేరాజు

అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం

-6లో



అంబులెన్స్‌లో ఉన్న తల్లి మృతదేహాన్ని చూసి విలపిస్తున్న కుమారుడు



వెంకటేశ్వరరావు, దుర్గ (పాతచిత్రం)

వేడుకకు బయలుదేరితే.. మృత్యువు ఎదురైంది..

ఆర్టీసీ బస్సు ఢీకొని దంపతుల దుర్మరణం

నిడదవోలు: బంధువుల ఇంట్లో జరిగే ఊయల వేడుకకు ద్విచక్ర వాహనంపై బయలుదేరిన దంపతులను మార్గ మధ్యంలో రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. సమిశ్రగూడెం ఎస్సై కె.వీరబాబు వివరాల ప్రకారం పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం పైడిపర్రుకు చెందిన బెల్లంకొండ వెంకటేశ్వరరావు(60), భార్య దుర్గ(50) కొవ్వూరు మండలం మద్దూరులో బంధువుల ఇంట జరుగుతున్న వేడుకకు సోమవారం ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. నిడదవోలు మండలం గోపవరం కాటా సెంటర్‌కు వచ్చేసరికి రాజమహేంద్రవరం నుంచి తాడేపల్లిగూడెం వెళుతున్న నిడదవోలు డిపోకు చెందిన ఆర్టీసీ బస్ వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో వారిద్దరు సంఘటన స్థలంలోనే మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నిడదవోలు సామాజిక ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇద్దరికి వివాహాలు జరిగాయి.

రాక కోసం ఎదురు చూస్తుంటే..

వెంకటేశ్వరరావు, దుర్గ డి.ముప్పవరం వరకు వచ్చేశారని, మరో పది నిమిషాల్లో వేడుక వద్దకు చేరుకుంటారని సమాచారం అందడంతో వారి రాక కోసం బంధువులు ఆశగా ఎదురు చూస్తుండగా ప్రమాద సమాచారం తెలియడంతో విషాదంలో మునిగిపోయారు. బంధువులు ప్రమాద స్థలానికి చేరుకునే సరికి వెంకటేశ్వరరావు దంపతులు రక్తపు మడుగులో పడి ఉన్నారు. వెంకటేశ్వరరావు బంటా మేస్త్రీగా పని చేస్తున్నారు. రోజువారీ కూలి పనులకు కార్మికులను తీసుకెళ్లేవారు. దుర్గ గృహిణి. అమ్మా, నాన్న లేవండి అంటూ వారి మృతదేహాలు ఉన్న అంబులెన్స్ బయట నుంచి కుమారుడు గొంతెత్తి పిలవడం ప్రతి ఒక్కరిని కంటతడి పెట్టించింది.

సమస్యలు పరిష్కరించాలని 108 సిబ్బంది వినతి

ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: తాము ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం, యాజమాన్యం వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని 108 ఉద్యోగుల జిల్లా కమిటీ కోరింది. సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ జె.నానాజీ మాట్లాడుతూ రెండు నెలలు గడిచినా జీతాలు జమచేయక, రెండేళ్లుగా ఇంక్రిమెంట్లు లేక, వేతన శ్లాబుని అప్‌గ్రేడ్ చేయక 108 ఉద్యోగులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. సమస్యలను పలుమార్లు యాజమాన్యం దృష్టి తీసుకెళ్లినా పరిష్కారం కాకపోవడంతో కలెక్టర్, డీఎంహెచ్‌వో, ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్, 108 జిల్లా మేనేజర్‌కు సోమవారం విన్నవించామన్నారు. ఎన్ని ఇబ్బందులున్నా నిబద్ధతతో పనిచేస్తున్న తమ సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.



డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందిస్తున్న సంఘ నాయకులు



సీతానగరం: రాపాక నుంచి కోరుకొండ వెళ్లే రోడ్డు దుస్థితి..

5 ఏళ్లుగా.. 54 కిలోమీటర్లు తిరగాల్సిందే!

వైకాపా ప్రభుత్వ హయాంలో రహదారుల మరమ్మతులు పూర్తిగా గాలికి వదిలేయడంతో ప్రస్తుతం విస్తారంగా కురుస్తున్న వర్షాలకు మరింత అధ్వానంగా మారాయి. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలోని రాపాక నుంచి కోరుకొండ వెళ్లే ర.భ.శాఖ 18 కిలోమీటర్ల రోడ్డు పరిధిలో.. 9 కిలోమీటర్ల పొడవునా పలుచోట్ల గుంతలు పడ్డాయి. వర్షపునీరు చేరడంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు పలు అవస్థలు పడుతున్నారు. కొన్నిచోట్ల అసలు రోడ్డే లేకుండా పోయింది. కొద్దిపాటి వర్షం కురిసినా రోడ్డు గుంతలు నీటితో నిండిపోయి కోరుకొండ వెళ్లే రాకపోకలు పూర్తిగా నిలిపివేస్తున్నారు. దీని వల్ల రాజమహేంద్రవరం చేరి అక్కడ నుంచి కోరుకొండ వెళ్లేందుకు మూడింతల ప్రయాణం పెరుగుతోంది. మొత్తంగా ఇక్కడ ఐదేళ్లుగా 9 కిలోమీటర్లలో రోడ్డు బాగాలేక 54 కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సి వస్తోంది. వ్యవసాయ భూముల్లో ఫలసాయం తెచ్చుకునేందుకు కూడా ట్రాక్టర్లు వెళ్లలేని పరిస్థితుల్లో రోడ్డుతో ఇబ్బంది పడుతున్నామని రైతులు వాపోతున్నారు. మూడేళ్ల క్రితం రూ.3.56 కోట్లతో రోడ్డు అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు పంపించినా నిధులు రాలేదని ర.భ.శాఖ ఏఈ వీరన్నబాబు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆదేశాలతో అవే ప్రతిపాదనలు ఇచ్చామని వివరించారు.

-న్యూస్‌టుడే, సీతానగరం

డెల్టాకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం 7,800 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేశామని జలవనరులశాఖ అధికారులు తెలిపారు. తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాలకు 1300, 1500, 5000 క్యూసెక్కులు విడుదల చేశారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో పోలీసులు కీలకం

అమరవీరుల సంస్మరణ దినంలో కలెక్టర్

దానవాయిపేట,(రాజమహేంద్రవరం): ప్రజాస్వామ్య పరిరక్షణలో పోలీసు శాఖ కీలకమని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా రాజమహేంద్రవరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్, ఎస్పీ డి.నరసింహకిషోర్, జేసీ ఎస్.చిన్నరాముడు, మున్సిపల్ కమిషనర్ కేతన్ గర్గ్, ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పోలీసు అమరవీరులకు నివాళి అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ విధులు స్వీకరించిన నాటి నుంచి అదరకుండా, బెదరకుండా పోలీసులు విధులు నిర్వర్తిస్తారన్నారు. దేశ రక్షణలో సైనికులు, సమాజ రక్షణలో పోలీసులు కీలకమన్నారు. ప్రజా శ్రేయస్సుకే మేము ఉన్నామనే భరోసా కలిగేటట్టు సిబ్బంది విధి నిర్వహణ చేపట్టాలన్నారు.

11 రోజులపాటు కార్యక్రమాలు: ఎస్పీ మాట్లాడుతూ సంస్మరణ దినం సందర్భంగా 11 రోజుల పాటు జిల్లా అంతటా పలు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనారోగ్యం కారణంగా మృతిచెందిన రాజమహేంద్రవరం ప్రకాశంనగర్ స్టేషన్‌లో ఏఎస్సై పి.శ్రీదేవి, జిల్లా ఏఆర్ విభాగంలోని కానిస్టేబుల్ వి.శ్రీనివాసరావు కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీలు అల్లూరి వెంకట సుబ్బరాజు, డీఎస్పీలు, సీఐలు, సిబ్బంది పాల్గొని అమరవీరుల స్తూపం వద్ద పుష్పాంజలి ఘటించారు.



పోలీసు అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

ఇసుక సరఫరాలో అవకతవకలకు పాల్పడితే చర్యలు

రామహేంద్రవరం కలెక్టరేట్: ఉచిత ఇసుక సరఫరా, రవాణాలో అవకతవకలకు పాల్పడినా, అనుమతి ఇవ్వని రీచ్‌లలో తవ్వకాలు జరిపినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జేసీ చిన్నరాముడు హెచ్చరించారు. జిల్లాలో 16 రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలకు అనుమతులు మంజూరు చేశామన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ రీచ్ పాయింట్ల వద్ద యంత్ర పరికరాలు వినియోగించరాదన్నారు. బోట్స్‌మెన్ సొసైటీ సభ్యులకు నిర్ణీత రుసుం చెల్లించామన్నారు. తవ్వకాల ఛార్జీ, ఆశీలు వసూలు, ర్యాంపు ఛార్జీలు అంటూ కొందరు వినియోగదారుల నుంచి నగదు వసూలు చేస్తున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయని, వీటిపై ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఇప్పటికే 44 బోట్స్‌మెన్ సొసైటీలకు అనుమతులు ఇచ్చామని, మరో 75 సొసైటీలకు అనుమతులు జారీ చేసే ప్రక్రియను చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లా యంత్రాంగం అనుమతించిన ప్రాంతాల్లో మాత్రమే పరిమితులకు లోబడి ఇంటి నిర్మాణం, మరమ్మతు పనుల కోసమే ట్రాక్టర్లలో ఇసుక తీసుకెళ్లాలి తప్ప నిల్వ చేసుకునేందుకు తరలించకూడదని స్పష్టం చేశారు.

బలమైన అభ్యసనతో పునాది వేయాలి


ఉపాధ్యాయురాలికి కిట్ అందజేస్తున్న సుభాషిణి

కొండగుంటూరు (రాజానగరం): ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు బలమైన అభ్యసనతో పునాది వేయడం ద్వారా విద్యాభివృద్ధి సాధ్యం అవుతుందని సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సుభాషిణి, బొమ్మూరు డైట్ ప్రిన్సిపల్ జయశ్రీ అన్నారు. రాజానగరం మండలంలోని కొండగుంటూరులో గల సత్యసాయిపరమేశ్ పాలిటెక్నిక్ కళాశాలలో ఒకటో తరగతి ఉపాధ్యాయులకు ఆరు రోజుల రెసిడెన్షియల్ ట్రైనింగ్ సమావేశాన్ని సోమవారం వారు ప్రారంభించారు. రాష్ట్ర పరిశీలకుడు బాలకృష్ణ మాట్లాడుతూ తూర్పుగోదావరి, కాకినాడ, డా.బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులకు ఇక్కడ 14 బ్యాచులుగా శిక్షణ ఉంటుందన్నారు. సమావేశంలో సమగ్ర శిక్ష కాకినాడ, కోనసీమ ఏఎంవోలు రామారెడ్డి, రాంబాబు పాల్గొన్నారు.

ఉద్యోగం పేరిట మోసంపై పోలీసు స్పందనలో ఫిర్యాదు


ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న ఏఎస్పీ సుబ్బరాజు

దానవాయిపేట(రాజమహేంద్రవరం): గోకవరం మండలం కొత్తపల్లి దుర్గానగరానికి చెందిన కె.డానియేల్ ఉద్యోగం పేరుతో తనతోపాటు మరో నలుగురు వద్ద రూ.2 లక్షలు తీసుకుని మోసం చేశారని కోరుకొండ ప్రాంతానికి చెందిన ముత్యాల శ్రీనివాస్ వాపోయారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. ఓ రొయ్యల పరిశ్రమలో సూపర్‌వైజర్ ఉద్యోగం ఇప్పిస్తానని నగదు తీసుకుని ఏడాదిగా తిప్పుతున్నాడని, న్యాయం చేయాలని పోలీసులను కోరారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని గోకవరం ఎస్సైను ఏఎస్పీ అల్లూరి వెంకట సుబ్బరాజు ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సివిల్, కుటుంబ సమస్యలు, మోసం, కొట్లాట సంబంధించిన 28 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ తెలిపారు.

నంబరు ప్లేటు.. నచ్చినట్లు రాస్తే కుదరదు!

న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం నేరవార్తలు

మీ వాహనానికి నంబరు ప్లేటు సరిగా లేకుంటే జరిమానా కట్టాల్సిందే. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని పోలీసు, రవాణా శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. పలువురు పోకిరీలు నంబరు ప్లేట్లను ఇష్టానుసారం రాయించుకుని వాహనాలను తిప్పేస్తున్నారు. కొందరు అసలు నంబరు ప్లేటు లేకుండా వాహనాలు తిప్పుతున్నారు. 2016 నుంచి షోరూంలలో వాహనాలను కొన్నవారు తప్పనిసరిగా ప్రభుత్వం అందజేస్తున్న హై సెక్యూరిటీ నంబరు ప్లేట్‌ను మాత్రమే బిగించుకోవాలన్న నిబంధన ఉన్నా చాలామంది అతిక్రమిస్తున్నారు.

వాహనాలకు వేర్వేరుగా..

● రవాణేతర వాహనాల నంబరు ప్లేటు తెలుపు రంగు ఉండి దానిపై నల్ల అక్షరాలు, అంకెలు ఉండాలి. ● రవాణా వాహనాలకు పసుపు రంగు నంబరు ప్లేటుపై నల్ల అక్షరాలు, అంకెలు ఉండాలి. ● ఛార్జి షన్ జరిగే విద్యుత్తు వాహనాలకు ఆకుపచ్చ నంబరు ప్లేటు ఉండాలి.


ద్విచక్ర వాహనంపై ఎమ్మెల్యేగారి తాలుకా అంటూ..

నంబరు ప్లేటుపై ఓ వాహనం చరిత్ర మొత్తం ఇట్టే తెలుసుకోవచ్చు. దీని ప్రాధాన్యతను గుర్తించి కేంద్ర మోటారు వాహనాల చట్టంలో కొన్ని నిబంధనలు ఉంచారు. వాహనం కొనుగోలు ఇట్టే కర్మాగారం హై సెక్యూరిటీ నంబరు ప్లేటును మాత్రమే బిగించుకుని వాల్సి ఉంది. ప్లేటుపై నంబరులోని అంకెలు, అక్షరాలు మినహా ఏమీ ఉండకూడదు. చాలా వాహనాలపై సినీనటులు, రాజకీయ నాయకుల చిత్రాలు ఉంటున్నాయి. అంకెలు, అక్షరాలను జిగ్ జాగ్‌గా రాస్తున్నారు.


ఓ ఇంటి పేరుతో ఇలా..

జరిమానా ఉంది..

మోటారు వాహనాల చట్టం ప్రకారం.. ఫ్యాన్సీ నంబర్లతో తిరుగుతుంటే రవాణేతర వాహనాలకు రూ.1,150, రవాణా వాహనాలకు రూ.1,300 అపరాధ రుసుం విధిస్తారు. ట్రాఫిక్ పోలీసుల తనిఖీలో పట్టుబడితే రూ.100 నుంచి రూ.150 వరకు చలానా రాస్తారు. ఇతర ఉల్లంఘనలుంటే అపరాధ రుసుములు మరింత పెరగడంతోపాటు కేసులు నమోదు వరకూ వెళ్తుంది.

నంబరు ప్లేటు ఎలా ఉండాలంటే.. ● సైజు మిల్లీ మీటర్లలో..

కేటగిరీ	వాహనం ముందు ప్లేటు			వెనుక ప్లేటు		
	పొడవు	మందం	వెడల్పు	పొడవు	మందం	వెడల్పు
ద్విచక్ర వాహనం	30	5	5	35	7	5
మూడు చక్రాల వాహనం	35-40	7	5	35-40	7	5
కార్లు, ఇతర వాహనాలు	65	10	10	65	10	10

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ జిల్లా జట్ల ఎంపికలు

మసీదుసెంటర్ (కాకినాడ): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎస్‌జీఎఫ్ జిల్లా ఎంపికలు కాకినాడ డీఎస్ఏ మైదానంలో సోమవారం జరిగాయి. అండర్-14 బాలబాలికలకు టెన్నిస్, అండర్-17 హ్యాండ్‌బాల్ బాలబాలికలకు హ్యాండ్‌బాల్, అండర్-14, 17 బాలబాలికలకు సైక్లింగ్ క్రీడల్లో జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించామని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి లంక జార్జి తెలిపారు. డీఎస్‌డీవో శ్రీనివాసకుమార్, రాష్ట్ర టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి టి.రామ్‌కుమార్, ఎస్‌జీఎఫ్ అసిస్టెంట్ సెక్రటరీలు జి.సునీల్‌కుమార్, కె.పరశురాం, పీఈటీలు కె.మంగాయమ్మ, పి.హరిమోహిని, వి.నీలిమ, మస్తాని, ఎన్.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.


టెన్నిస్ ఆడుతున్న క్రీడాకారిణి

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాల్)	ధర (రూపాయల్లో)
కొత్తకాయ (1000)	11,500
పాత కొబ్బరి గండేర	17,500
గటగట	15,500
కొత్త కొబ్బరి గండేర	16,500
గటగట	14,500
పచ్చి కాయ	13,000-13,500
కొబ్బరి	12,500-13,000
15 కేజీల బెల్లం	3,750
	260

వెంకోబ్ చికెన్ ధర కిలో

ఫారంకోడి	135-00
బ్రాయిలర్ లైవ్	157-00
డ్రెస్సింగ్	228-00
స్కిన్‌లెస్	259-00

సరకుల నాణ్యతలో జాగ్రత్తలు తీసుకోండి

అన్నవరం: అన్నవరం దేవస్థానంలో నిత్యాన్నదాన పథకం, ప్రసాదం తయారీ, ఇతర వాటికి కొనుగోలు చేసే సరకుల నాణ్యత విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సూచించారు. కలెక్టరును ఈవో రామచంద్ర మోహన్ సోమవారం కాకినాడలో కలిశారు. పలు అంశాలపై చర్చించారు. బెల్లంలో సుక్రోజు (తీపి మూలకం) తక్కువగా ఉందంటూ కలెక్టర్ ఆరా తీశారు. బెల్లం కేవలం నిత్యాన్నదానంలో సాంబారు తయారీకి మాత్రమే వినియోగిస్తామని వివరించారు. సత్యదేవుని ప్రసాదం తయారీకి విజయవాడలోని విజయ డెయిరీ నెయ్యి వినియోగిస్తున్నామన్నారు. ఇతర సరకుల నాణ్యత విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు.

ఇజ్రాయిల్ పంపిస్తానని.. రూ.కోటిన్నరకు కుచ్చు టోపీ


కలెక్టరేట్ ఎదుట బాధితుల నిరసన

అమలాపురం కలెక్టరేట్, అల్లవరం, న్యూస్‌టుడే: వారంతా కూలీలు. గల్ఫ్ దేశాల్లో పనికి వెళ్తే ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని భావించారు. వారి ఆశను ఆసరాగా చేసుకున్న ఓ ఏజెంట్ రూ.కోటిన్నరకు కుచ్చుటోపీ పెట్టాడు. డా.బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఈ ఘటన చోటు చేసుకుంది. బాధితులు సోమవారం అమలాపురం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్లవరం మండలం కొమరగిరిపట్నానికి చెందిన పాస్టర్ ఆకుల షాలెంరాజు ఏజెంట్‌గా పరిచయం చేసుకుని ఇజ్రాయిల్ పంపిస్తానని రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేశాడరన్నారు. తర్వాత కాలయాపన చేస్తుండటంతో గట్టిగా నిలదీయగా టూరిస్టు వీసాపై జోర్డాన్ తీసుకు వెళ్లి 15 రోజుల తర్వాత హైదరాబాద్ తీసుకువచ్చి వదిలేశాడని వాపోయారు. ప్రస్తుతం ఇజ్రాయిల్‌లో యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో పంపించడం కుదరదని తప్పించుకుంటున్నాడన్నారు. తామిచ్చిన సొమ్ము ఇవ్వాలని అడిగితే తిరిగి బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోయారు. అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. బాధితుల్లో అమలాపురం, రావులపాలెం, రాజోలు, పి.గన్నవరం, అంతర్వేది, పాలకొల్లు, ఒంగోలు ప్రాంతాలకు చెందిన 33 మందికిపైగా ఉన్నట్లు వారు తెలిపారు.

అల్లవరంలో ఫిర్యాదు: ఆకుల షాలెంరాజు, ఆయన భార్య తమను ఇజ్రాయిల్ పంపిస్తానని నమ్మించి మోసం చేశాడని పలు ప్రాంతాలకు చెందిన బాధితులు సోమవారం అల్లవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తామంతా గతేడాది డిసెంబరు నుంచి ఈ సంవత్సరం మార్చి వరకు విడతల వారీగా నగదు ఇచ్చామని పేర్కొన్నారు. వరంగల్‌కు చెందిన ఏజెంట్ చిరంజీవులు ద్వారా పంపిస్తానని చెప్పారన్నారు. దీనిపై ఎస్సై హరీష్‌కుమార్‌ను వివరణ కోరగా ఫిర్యాదు తీసుకుని విచారణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

● ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ బి.కృష్ణారావుకు సోమవారం వినతి అందజేశారు. తమను చర్చి పాస్టర్ సాల్మన్‌రాజు, వరంగల్‌కు చెందిన ఏజెంట్ బులి చిరంజీవులు మోసం చేశారని వాపోయారు.

ప్రజా ఫిర్యాదులకు శాశ్వత పరిష్కారం చూపాలి


అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

రాజమహేంద్రవరం కలెక్టరేట్: గ్రామస్థాయిలో పరిష్కారం కావాల్సిన సమస్యలు కూడా కలెక్టరేట్ వరకు వస్తున్నాయని, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం విషయంలో క్షేత్రస్థాయి సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ ప్రశాంతి అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా జేసీ చిన్నరాముడు, ఇతర అధికారులతో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఒకసారి వచ్చిన ఫిర్యాదు మళ్లీ రాకుండా శాశ్వత పరిష్కారం చూపేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చేవారం నుంచి ప్రజలు సంబంధిత అధికారులకే నేరుగా అర్జీ అందజేస్తారని, అధికారులు సిబ్బందితో మాట్లాడి సమస్య పరిష్కారానికి చేపట్టే చర్యలపై సమగ్ర వివరాలు మార్జినల్ రిమార్క్‌లో పేర్కొంటూ వివరణ ఇవ్వాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. పరిష్కార వేదికకు మొత్తం 144 అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూ పరిధిలోని సమస్యలపై 58 అర్జీలు ఉండగా పోలీసు శాఖ పరిధిలో పరిష్కరించాల్సినవి 23, పంచాయరాజ్ శాఖ పరిధిలోనివి 16, వ్యవసాయశాఖ పరిధిలోనికి 10, ఇతర శాఖ పరిధిలో పరిష్కరించాల్సిన అర్జీలు 37 ఉన్నాయి.

అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తిపై బ్లేడుతో దాడి

తుని: పట్టణంలోని వీరవరపుపేటకు చెందిన ఓ మహిళ తనపై అత్యాచారయత్నం చేసిన వ్యక్తిపై బ్లేడుతో దాడి చేసిందని సీఐ ఎం.గీతా రామకృష్ణ తెలిపారు. బాధిత మహిళ ఇంట్లో ఉండగా అదే ప్రాంతానికి చెందిన అఖిల్‌బాబు అత్యాచారం చేసేందుకు ప్రయత్నించాడన్నారు. దీంతో ఆమె బ్లేడుతో దాడి చేయడంతో పురుషాంగానికి గాయమవ్వగా పరారయ్యాడన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సోదరి షర్మిల ద్వారా కాంగ్రెస్‌లో వైకాపా విలీనం

నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

రంగంపేట: "విజయవాడ వరదల్లో బురద రాజకీయం చేసిన జగన్‌కు గడ్డు పరిస్థితులు చుట్టుముట్టాయి. తన సోదరి షర్మిల ద్వారా కాంగ్రెస్‌లో వైకాపాను విలీనం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు." అని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. రంగంపేట మండలం పల్లె పండుగ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైకాపాకు చెందిన కొందరు శాసన మండలి సభ్యులు, శాసన సభ్యులు కూటమిలో చేరేందుకు ప్రయత్నిస్తుండగా.. ఆ పార్టీకి, పదవికి రాజీనామా చేస్తేనే ఆలోచిస్తామని చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చెప్పారని రామకృష్ణారెడ్డి గుర్తు చేశారు. తనపై 39కేసులు పెట్టి 14 రోజుల పాటు జైలులో పెట్టారని, అలానే అనపర్తి నియోజకవర్గంలోని అనేక మందిపై కేసులు బనాయించారని వివరించారు.

16 మంది మృతికి కారణమైన డ్రైవర్, క్లీనర్‌కు జైలు, జరిమానా

గండేపల్లి: ఎట్టకేలకు 9 ఏళ్ల తర్వాత లారీ బోల్తాపడిన ప్రమాదంలో 16మంది మృతికి కారణమైన డ్రైవర్, క్లీనర్‌లకు శిక్ష పడింది. జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపిన వివరాలివీ.. 13 సెప్టెంబరు 2015న అర్ధరాత్రి రాజమహేంద్రవరం నుంచి జగ్గంపేట వైపు వస్తున్న సిమెంట్ బూడిద లారీపై ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి, తొండంగి మండలాలకు చెందిన 34 మంది కూలీలు స్వగ్రామాలకు వెళ్లేందుకు లారీ ఎక్కారు. వీరు పశ్చిమగోదావరి చింతలపూడి గ్రామంలో జామాయిల్ పనులకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో లారీ ఎక్కగా లారీ గండేపల్లి శివారు ఎన్‌హెచ్‌పై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 16 మంది కూలీలు సిమెంట్ బూడిదలో ఇరుక్కుని మృతి చెందగా 10 మందికి గాయాలయ్యాయి. మరికొందరు లారీపై నుంచి దూకేయడంతో సురక్షితంగా బయటపడ్డారు. ఈ ప్రమాదంలో అప్పటి ఎస్సై బి.వి.రమణ 304, 337, 338 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. పెద్దాపురం జడ్జి దీప దైవకృప 76 మంది సాక్షులను విచారించిన అనంతరం లారీ డ్రైవర్ జోగా శ్రీను(41). 304, 338, 337, 134 తదితర సెక్షన్ల కింద పన్నెండున్నర ఏళ్ల జైలు, రూ.12 వేలు జరిమానా, క్లీనర్ బొట్టా లోవరాజుకు ఆర్నెళ్ల జైలు, రూ.వెయ్యి జరిమానా విధించారు. కేసు దర్యాప్తు చేసిన అప్పటి డీఎస్పీ రాజశేఖరావు, ప్రస్తుత డీఎస్పీ హరిరాజు, సీఐ శ్రీనివాస్‌ను, ఎస్సై శివనాగబాబును ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందించారు.

వర్షానికి అరటిని రక్షించుకుందాం

న్యూస్‌టుడే, ఆత్రేయపురం



విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వాణిజ్యపంటల్లో ముఖ్యమైన అరటి పంటలో నీరు నిలిచి నష్టం వాటిల్లుతోంది. తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే తోట ఆరోగ్యకరంగా ఉంటుందని ఉద్యాన శాఖాధికారి కోటేశ్వరరావు సూచించారు.

ప్రశ్న సమాధానం

ప్రశ్న: అరటిలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు నీరు నిల్వ ఉండటంతో పంట రాణింపు ఉండటం లేదు. ఊట ఎక్కి వడిలిపోతున్నాయి. ఎలాంటి చర్యలు తీసుకోవాలి.

-త్రిమూర్తులు, రైతు, ఉచ్చిలి

సమాధానం: నీరు అధికంగా ఉన్న తోటల్లో సిగటోకా, దుంపకుళ్లు వంటి తెగుళ్లు ఆశిస్తాయి. బ్లీచింగ్ పౌడర్ 25 గ్రాములు లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్లలో పోయాలి. ఆకుమచ్చ తెగులు నివారణకు ప్రొపికొనజోల్ 1 మి.లీ లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి. ముందుగా నీరు బయటకు పోయేటట్లు చూసుకోవాలి.

ప్రశ్న: తుపాను సమయంలో అరటిని ఎలా కాపాడుకోవాలి.

- సూర్య ప్రకాశరావు, రైతు, రాజవరం

సమాధానం: అధిక గాలుల నుంచి రక్షణకు వెదురు బొంగులు పాతి ఊతం ఇవ్వాలి. పక్వానికి వచ్చిన గెలలు కోసి విక్రయించుకుంటే నష్టాల నుంచి గట్టెక్కవచ్చు. మూడు నుంచి నాలుగు మాసాల మొక్కల మొదళ్లకు మట్టి ఎగదోస్తే బలంగా పెరిగి గాలులకు తట్టుకుంటుంది.


అరటిలో నిల్వ ఉన్న వర్షపునీరు

అంతర పంటలతో అదనపు రాబడి

నాలుగేళ్లపాటు ప్రభుత్వ రాయితీలు

కిర్లంపూడి, జగ్గంపేట గ్రామీణం: ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగుపై రాయితీలు ప్రకటించి ప్రోత్సహిస్తుండడంతో ఎక్కువ మంది రైతులు మొగ్గు చూపుతున్నారు. పామాయిల్ మొక్కలు నాటిన దగ్గర నుంచి నాలుగేళ్ల పాటు దిగుబడి రావడానికి సమయం పడుతుంది. ఈ నాలుగేళ్లలో రైతులు అంతర పంటలు వేసి ఆదాయాన్ని పొందవచ్చని ఉద్యానశాఖ అధికారిణి శ్రీవల్లి సూచిస్తున్నారు.


వేలంకలో పామాయిల్ తోటలో అంతర పంటగా అరటి

వేసే విధానం: పామాయిల్ మొక్కల మధ్య అరటి, కూరగాయలు, పత్తి, మొక్కజొన్న, అపరాలు వేసుకోవచ్చు. మొక్కలు నాటి ఏడేళ్లు దాటితే కోకో, వక్క, అల్లం, పసుపు ఇలా నీడన పండే పంటలు వేయొచ్చు. అంతర పంటల ద్వారా ఎకరాకు రూ.పదివేల వరకు ఆదాయం వస్తుంది. మినుము, పెసర ఎకరాకు నాలుగు నుంచి ఐదు క్వింటాళ్ల దిగుబడి వస్తుండగా క్వింటా రూ.రెండు వేలు పైబడి అమ్ముతున్నారు. అరటి, కూరగాయలు, పత్తి, మొక్కజొన్న ఎకరాకు రూ.10 నుంచి 15 వేల వరకు ఆదాయం.

ఉద్యానశాఖ ద్వారా రాయితీలిలా..

పామాయిల్ పంటలు సాగుచేసే రైతులు వాటిలో అంతర పంటలు వేసుకునేందుకు ప్రభుత్వం రాయితీలు ఇచ్చి ప్రోత్సహిస్తుంది. అంతర పంటలు ఏ రకంగా సాగు చేసుకున్నప్పటికీ హెక్టారుకు రూ.5,250 రాయితీగా ఇస్తుంది. ఒక్కొక్క రైతు ఐదు ఎకరాల వరకు రాయితీ పొందవచ్చు. ఈ విధంగా నాలుగేళ్లు రైతులకు రాయితీ ఇస్తున్నట్లు ఉద్యానశాఖ అధికారిణి శ్రీవల్లి తెలిపారు. కోకో అంతర పంటగా వేసుకునే రైతులు మొక్కల వయస్సు ఏడేళ్లు దాటిన వాటిలో అంతర పంటలుగా వేసే కోకో పంటకు హెక్టారుకు రూ.16వేలు రాయితీగా అందుతుంది. మెట్టప్రాంతంలో పామాయిల్ సాగును పెంచేందుకు ప్రభుత్వం వంద శాతం రాయితీపై మొక్కలు ఇస్తున్నారు.

ఏటా రూ. 50వేల ఆదాయం

మీ కోసం

పామాయిల్‌లో అంతర పంటగా మినుము, పెసర వంటి అపరాలు ఏడాదికి రెండుసార్లు వేస్తున్నాం. ప్రతిపంటకు నాలుగు నుంచి ఐదు క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. క్వింటా రూ.ఎనిమిది వేల వరకు అమ్ముతున్నాం. పంటకు రూ.30వేల ఆదాయం వస్తుంది. ఆ విధంగా ఏడాదికి రూ. 50 వేల నుంచి రూ.60వేలు ఆదాయం వస్తుంది.

-శెట్టిపల్లి దుర్గాప్రసాద్, సీతారామపురం

రైతేరాజు

దుంప తోటల్లో నీరు నిలిస్తే చేటు




బిక్కవోలు, పెద్దాపురం: కర్రపెండలం దుంప తోటల్లో వర్షపునీరు నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలని పెద్దాపురం దుంప పరిశోధనా స్థానం కీటక శాస్త్రవేత్తలు డా. సునీత(అధిపతి), ఉద్యాన శాస్త్రవేత్త డా. జానకి వెల్లడించారు. నీరు 24 గంటల కన్నా ఎక్కువ నిల్వ ఉంటే దుంపకు కుళ్లు వచ్చే అవకాశం ఉంది. దుంప కుళ్లు వస్తే బాగా చివికిన పది కిలోల పశువుల ఎరువులో రెండు కిలోల ట్రైకోడెర్మా విరిడీ కలిపి వారం రోజులు నిల్వ ఉంచి మొక్క మొదళ్లలో వేసుకుంటే నివారించవచ్చు.

తెలుసుకుందాం..

ఎరువుల వినియోగం: దుంపతోటల్లో అధిక దిగుబడికి, అధిక పిండిశాతం కోసం మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వాడాలి. ఎకరాకు 40 కిలోలు వేయాలి. ఈ సమయంలో నత్రజని వాడకం తగ్గించాలి. పంటవేసిన 30, 60, 90 రోజులకు 52 కిలోల యూరియా ఎకరాకు మూడు దఫాలుగా మొక్క ఎదుగుదలకు వేయాలి. వేరు పెరుగుదలకు సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ ఎకరాకు దుక్కిలో 150 కిలోలు తప్పని సరిగా వేసుకోవాలి. కాంప్లెక్సు ఎరువైన 13-0-45ను పదిగ్రాములు లీటరు నీటికి, సల్ఫేట్ ఆఫ్ పొటాష్ 5 గ్రాములు లీటరు నీటికి కలిపి మొక్కలపై పిచికారీ చేయాలి.

గేదెలు చూలు కట్టే కాలం.. అప్రమత్తత అవసరం



సామర్లకోట గ్రామీణం: ప్రస్తుతం శీతలగాలులు వీచే సమయం కావడంతో గేదెలు చూలు కట్టేందుకు అనుకూలమైన సమయం అని కరప ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. ఈ సమయంలో గేదెలతో పాటు యుక్త వయసుకు వచ్చిన పడ్డలు, గొడ్డుమోతు పశువులకు ఖనిజ లవణ మిశ్రమాలను దాణాలో కలిపి ఇవ్వాలి. మొలకెత్తిన పెసలు, సెనగలు వంటి వాటిని నిత్యం దాణాలో పెట్టడం ద్వారా గేదెలు ఎదకు రావడంతో పాటుగా హార్మోన్ల లోపాల సమస్యలు పరిష్కారమై చూలు కట్టే అవకాశం ఉంటుంది. ఎదకు వచ్చిన పశువులను పోతుల వద్ద కాకుండా కృత్రిమ గర్భధారణ ద్వారా మేలు జాతి పశువుల సంతతిని వృద్ధి చేసుకోవచ్చన్నారు..

రాజమహేంద్రవరం

సినిమాలు దానవాయిపేట: శ్యామల: వేట్టయన్, ఊర్వశి: సత్యం సుందరం, సూర్యప్యాలస్: ఇద్దరు, రాజా: మార్టిన్, కుమారి, అప్సర: దేవర, అశోక: విశ్వం, స్వామి: స్వాగ్, అనుశ్రీ: జనక అయితే గనక, సూర్యమినీ: జిగ్రా, శివజ్యోతి: మార్టిన్, రంభ: రాధే కృష్ణ, మానాన్న సూపర్ హీరో(రెండేసి ఆటలు), మేనక: కల్లు కాంపౌండ్, మార్టిన్(రెండేసి ఆటలు), వీఎస్ మహల్: వేట్టయన్, విశ్వం(రెండేసి ఆటలు).

రైతుబజారులో నిన్నటి ధరలు(రూ.లలో)

దేవీచౌక్: టమాట-36, వంకాయలు (నలుపు-34/గులాబీ-45/తెలుపు-34/దొమ్మేరు-48), బెండ-36, కాకర-28, బీర (పందిరి-35/పొట్టి-30), దొండ-24, క్యారెట్-44/మట్టికారం-40, బీట్‌రూట్-40, గోరుచిక్కుళ్లు-32, దోస-34, ఆనపకాయ-28/30, చిక్కుళ్లు-90/దేశవాళీ-96, పచ్చిమిర్చి-38, బంగాళదుంప-33, ఉల్లిపాయలు(పాతవి-50/కొత్తవి-34).



మేమున్నాం.. మీకు తోడుగా



సమస్య: స్థానిక ఆల్కాట్‌తోట కాలనీ వెనుక వెంకటరామరాజునగర్‌లో విద్యుత్తు స్తంభం పక్క నుంచి భూమిలో ఉన్న తాగునీటి పైపులైను వారం రోజులుగా లీక్ అవుతోంది. నీరు వృథాగా రోడ్డుపై నుంచి పోతోంది. - ఎ.పోసారావు, స్థానికుడు

సమాధానం: సిబ్బందిని పంపించి పైపులైను మరమ్మతులు చేయిస్తాం. - చంద్రశేఖర్, వాటర్స్ వర్క్స్ డీఈ

సమస్య: స్థానిక కోటిలింగాలపేట కాళ్లవారివీధి వెనుకవైపు డ్రెయిన్‌లో పూడిక తొలగించకపోవడంతో మురుగునీరు నిలిచిపోయి ఇబ్బందిగా మారింది. - కోటేశ్వరరావు, స్థానికుడు

సమస్య: స్థానిక మెరకవీధిలోని జట్ల సంఘం కార్యాలయం సమీపంలో చెత్త పోగులను తొలగించకపోవడంతో తడిచి పడిపోతున్నాయి. చినుకులు పడితే వర్షం వచ్చినప్పుడు మురుగునీరు నిలిచిపోతోంది. - ధనుంజయరావు, స్థానికుడు

సమస్య: వీరభద్రపురం రామాలయం ఎదుటి వీధిలోని కాలువ 15 రోజులుగా శుభ్రం చేయకపోవడంతో పూడిక పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుంది. - అనంత్

సమస్య: లక్ష్మీవారపుపేట ఎలుకలవారివీధిలో చెత్తకుప్పలు పేరుకుపోయి అపరిశుభ్ర వాతావరణం నెలకొని ఇబ్బందులు పడుతున్నాం. - సూర్యచంద్రరావు

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి సమస్యలు పరిష్కరిస్తాం. - వినూత్న, ఎంహెచ్‌వో

– న్యూస్‌టుడే, వి.ఎల్.పురం



✦ కంబాలపేట రామాలయం వీధిలో కాలువల్లో పూడిక తొలగించడం లేదని ఈ నెల 20న అందిన ఫిర్యాదుపై నగరపాలక సిబ్బంది స్పందించారు. కాలువలో పూడికలు తొలగించారు.

– న్యూస్‌టుడే, టి.నగర్

సమస్యలపై సంప్రదించాల్సిన నంబర్లు

83282 39927, 80089 02897

ప్రశాంతంగా ముగిసిన టెట్

శ్యామలా సెంటర్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) సోమవారంతో ప్రశాంతంగా ముగిసింది. రెండు వారాలుగా రాజమహేంద్రవరం లూథర్‌గిరి ఐయాన్ డిజిటల్ కేంద్రంలో ఈ పరీక్షలు జరిగాయి. సోమవారం ఉదయం జరిగిన సోషల్‌స్టడీస్ పరీక్షకు 243 మందికి గాను 210 మంది, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 225 మందికి గాను 178 మంది హాజరయ్యారని డీఎస్ఈఓ కె.వాసుదేవరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వేదన వినండి.. వెతలు తీర్చండి

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: మార్కెట్ తరలించిన అవస్థలు.. మందుబాబుల వీరంగంతో సమస్యలు.. కాళ్లు అరిగేలా తిరిగినా దక్కని ఇంటి స్థలం.. కాలువ నిర్మాణం పూర్తికాక కష్టం.. ఇవీ నగరవాసుల వెతలు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలువురు అర్జీదారులు సమస్యలపై వినతులు అందజేశారు. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ కేతన్ గర్గ్ తెలిపారు. నగరంలో మౌలిక వసతులు మెరుగుపర్చేందుకు ప్రణాళికాబద్ధంగా పనులు చేపడుతున్నామన్నారు. తుఫాను సీజన్లో అంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ కేతన్ గర్గ్

మార్కెట్ తరలించి.. వసతులు కల్పిస్తే..



అప్సర థియేటర్ రోడ్డులో నీటి మార్కెట్‌ను తరలించే ప్రక్రియలో భాగంగా ఆవ ప్రాంతం వద్ద భూమిని కొనుగోలు చేయాలని ప్రభుత్వం సూచించింది. దీంతో అక్కడ భూమిని కొనుగోలు చేశాం. మార్కెట్‌ను ఇప్పటి వరకూ తరలించలేదు. కనీసం ఆవ ప్రాంతంలో సిద్ధం చేసిన స్థలంలో మౌలిక వసతులు కల్పించడం లేదు. రోడ్డు, కాలువల నిర్మాణం చేయలేదు. ఇప్పటి వరకూ మార్కెట్ తరలించే ఊసే లేకుండా పోయింది. - సుబ్బారావు, రంగారావు, సత్యనారాయణ

కాలువ విస్తరించి కష్టాలు తీర్చాలి



మోరంపూడి, ఆవ ప్రాంతం వద్ద అపార్ట్‌మెంటు ఆనుకుని నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎగువ ప్రాంతం నుంచి కాలువ నిర్మించారు. పొడిగించకుండా అపార్ట్‌మెంటు వరకూ మాత్రమే నిర్మించడంతో వర్షం వస్తే నీరంతా భవనం లోపలకు వచ్చి చేరుతోంది. దీంతో బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతోంది. కాలువ చివరి వరకు నిర్మించాలి. - పండిరిబాబు, వెంకటరమణ మూర్తి

అద్దెల దరువుతో అవస్థ



కంబాలచెరువు మారుగాయల మార్కెట్‌ను ఆనుకుని మున్సిపల్ బడ్డీ దుకాణాల అద్దె పెంచేశారు. నెలకు రూ.5 వేల వరకూ అద్దె చెల్లించాలని నిర్ణయించడంతో ఇబ్బందులు పడుతున్నాం. చిన్నచిన్న వ్యాపారాలు జరిగే మాకు అంత అద్దెలు చెల్లించడం కష్టంగా మారింది. - సత్యవతి

మద్యం వ్యాపారానికి అడ్డుకట్ట పడేనా..



బొమ్మూరు సి-బ్లాక్ టిడ్కో గృహాల వద్ద ఇతర ప్రాంతాల నుంచి కొందరు ఏర్పాటు చేసి రాత్రిపూట అక్రమంగా మద్యం వ్యాపారం చేస్తున్నారు. మహిళలు బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. మందుబాబులు అక్కడకు చేరి వచ్చిపోయే వారితో దురుసుగా ప్రవర్తిస్తున్నారు. - టిడ్కో నివాసితులు

ఇల్లు.. స్థలం రెండూ లేవు!



గతంలో టిడ్కో ఇల్లు మంజూరైంది. అది కాదని కూనవరంలో స్థలం కేటాయించామని హామీ పత్రం ఇచ్చారు. ఇప్పటి వరకూ స్థలం కేటాయించలేదు. రెండేళ్లుగా కాళ్లు అరిగేలా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. - జ్ఞానేశ్వరి

దళారులు దిక్కున్నచోట చెప్పమంటున్నారు..

జాంపేట చిరు వ్యాపారుల ఆవేదన



ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన చిరు వ్యాపారులు

వి.ఎల్.పురం: నగరంలోని జాంపేట చేపల మార్కెట్‌లో కొంతమంది దళారులు వ్యాపారాలను అడ్డుకుంటూ తమకు జీవనోపాధి లేకుండా చేస్తున్నారని, ప్రశ్నిస్తే దిక్కున్నచోట చెప్పుకోమంటూ బెదిరిస్తున్నారని పలువురు మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. నగరపాలకసంస్థ అధికారులకు అనేకసార్లు ఫిర్యాదు చేసినా రాజకీయ ఒత్తిడి వల్ల తామేం చేయలేకపోతున్నామని చెబుతున్నారని వాపోయారు. దీనిపై న్యాయం చేయాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అధికారులకు అర్జీ అందజేశారు. జాంపేట చేపల మార్కెట్‌లో 80 మంది మత్స్యకారులకు గతంలో నగర పాలక సంస్థ ఖానాలను కేటాయించిందని, డబ్బులు కట్టి తాము చేపల విక్రయాలు సాగిస్తూ ఎంతోకాలంగా జీవనోపాధి పొందుతున్నామన్నారు. కొందరు దళారులు రాజకీయ నాయకుల పేర్లు చెప్పి ఇక్కడ దందా చేస్తున్నారని చెప్పారు. మార్కెట్ బయట రోడ్డుకు ఇరువైపులా అనధికారికంగా చేపల దుకాణాలు పెట్టి కొనుగోలుదారులను లోపలకు రాకుండా చేస్తున్నారన్నారు. దీంతో తమకు వ్యాపారాలు లేక తెచ్చిన చేపలు పాడైపోయి డంపింగ్ యార్డులో పడేయాల్సిన పరిస్థితి ఏర్పడి ఆర్థికంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

పోటీతత్వంతోనే ప్రతిభ.. సృజనాత్మకత

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు పోటీలు దోహదపడతాయని శ్రీ సత్యసాయి గురుకులం పాఠశాల ప్రిన్సిపల్ కె.గుర్రయ్య, పోటీతత్వంతోనే బాలల్లో సృజనాత్మకత బయటకొస్తుందని శ్రీ షిర్డీసాయి పాఠశాల డైరెక్టర్ టి.శ్రీవిద్య అన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో ఈ పాఠశాలల్లో సోమవారం జరిగిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శ్రీ సత్యసాయి గురుకులంలో నిర్వహించిన పోటీల్లో సాహిల్ కుమార్(పదో తరగతి), వై.రూన్సీ(తొమ్మిదో తరగతి), ఎ.దేవ హర్ష(ఎనిమిదో తరగతి) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి 'ఈనాడు' సమకూర్చిన బహుమతులను ప్రిన్సిపల్ కె.గుర్రయ్య, కరస్పాండెంట్ ఎ.శ్యాంసుందర్ అందజేశారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా కె.ఎస్.కవితాదేవి, సి.కరుణ, కె.విజయలక్ష్మి వ్యవహరించారు.



శ్రీ సత్యసాయి గురుకులంలో వ్యాసరచన పోటీలో విద్యార్థులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ గుర్రయ్య

శ్రీ షిర్డీసాయి పాఠశాలలో..

షిర్డీ సాయి పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో కె.లాస్య ప్రశాంతి(తొమ్మిదో తరగతి), జి.జీవన జిత్య(పదో తరగతి), ఎ.శ్రీనిధి(ఎనిమిదో తరగతి) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి 'ఈనాడు' సమకూర్చిన బహుమతులను పాఠశాల డైరెక్టర్ టి.శ్రీవిద్య, డీన్ కె.శ్రీనివాస్ అందించారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా వి.రవిప్రకాష్, కె.శివప్రసాద్‌లు వ్యవహరించారు.



వ్యాసరచన పోటీలో పాఠశాల విద్యార్థులు



విజేతలతో శ్రీ షిర్డీసాయి పాఠశాల డీన్ శ్రీనివాస్

'బంగారుకొండ ప్లస్' అమలుకు కార్యాచరణ

రాజమహేంద్రవరం కలెక్టరేట్: చిన్నారుల్లో పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు 'బంగారుకొండ ప్లస్' అమలుపై కార్యాచరణ రూపొందిస్తున్నట్లు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించి రూపొందిస్తున్న కార్యాచరణపై అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద కార్యక్రమానికి రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. ఐసీడీఎస్‌తోపాటు ఆరోగ్యశాఖను అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు.

'ప్రాజెక్టుకు తోడ్పాటు అందిస్తాం'

టి.నగర్, న్యూస్‌టుడే: రైలు ప్రమాదాలు అరికట్టేందుకు పాలచర్ల బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన భాను ప్రకాష్, ప్రణీత్ రూపొందించిన ప్రాజెక్టును ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు సోమవారం వివరించారు. ప్రమాదాలు ముందుగానే పసిగట్టేలా యూఎల్ఆర్ఎస్ సిస్టం పేరుతో ఈ ప్రాజెక్టును తయారు చేసినట్లు వివరించారు. పూర్తిస్థాయిలో రూపొందించేందుకు మరింత వ్యయం అవుతుందన్నారు. ప్రాజెక్టు మరింత అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం తోడ్పాటు విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే చెప్పారు.

అంతా ముందుకొస్తే దివ్యమైన సేవ

రాజమహేంద్రవరం కలెక్టరేట్: మానవతా దృక్పథంతో దివ్యాంగులను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కలెక్టర్ పి.ప్రశాంతి పిలుపునిచ్చారు. తాడేపల్లిగూడేనికి చెందిన మదర్ థెరిస్సా ఛారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని 13 మంది దివ్యాంగులకు సుమారు రూ.3.50 లక్షలు విలువ చేసే కృత్రిమ అవయవాలు, వినికిడి పరికరాలు, ఇతర ఉపకరణాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మదర్‌థెరిస్సా ఛారిటబుల్ సొసైటీ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సాయం అందించడం స్ఫూర్తిదాయకమన్నారు. ఇటువంటి సమాజ సేవా కార్యక్రమాల్లో మరిన్ని సంస్థలు, ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు వై.ఎస్.జె.మోజెస్, ఉపాధ్యక్షుడు వై.ఐజక్‌లు తదితరులు పాల్గొన్నారు.



ఉపకరణాలు అందిస్తున్న కలెక్టర్, సంఘ సభ్యులు

ఒక్క కాల్.. అసాంఘిక శక్తుల ఆటకట్టు

దానవాయిపేట(రాజమహేంద్రవరం): నగర పరిధిలో అసాంఘిక శక్తుల కార్యకలాపాలను అణచివేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ డి.నరసింహకిషోర్ పేర్కొన్నారు. ఆ మేరకు నగరంలో నూతనంగా ఇటీవల ఆరు ప్రత్యేక పార్టీలు, ఓ మహిళ రక్షక్ బృందంతో నిరంతరం నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆయా బృందాలు ప్రతి రోజు నైట్ బీట్లు, క్రైమ్ బీట్లుతో పెట్రోలింగ్ నిర్వహిస్తాయన్నారు. శని, ఆదివారాల్లో అదనపు బీట్లు ఏర్పాటు చేసి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ తెలిపారు. నగరవాసులకు ఎటువంటి సమస్య ఎదురైనా 94932 06006 వాట్సాప్, 112 నంబర్లను సంప్రదించి సహాయం పొందవచ్చునన్నారు.



ప్రత్యేక పెట్రోలింగ్ బృందాలు

ఉద్యోగ మేళాకు వెళ్లొద్దామా..

టి.నగర్, న్యూస్‌టుడే: యువతకు ఉపాధి కల్పనలో భాగంగా ఈ నెల 26న రాజమహేంద్రవరం ఆర్ట్స్(అటానమస్) కళాశాల ఆవరణలో మెగా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన నివాసంలో జాబ్ మేళా కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత అయిదేళ్లు రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పెంచి పోషించారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రభుత్వ నిబంధనల ప్రకారమే జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



కరపత్రం విడుదల చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్, తదితరులు

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య



వి.ఎల్.పురం (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: రైలు కింద పడి గుర్తుతెలియని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ వద్ద సోమవారం ఈ సంఘటన చోటు చేసుకుంది. జీఆర్పీ హెచ్‌సీ మణి తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వేస్టేషన్‌లో రెండో నంబరు ప్లాట్‌ఫామ్ వద్ద ఉదయం గూడ్సు రైలు వచ్చే సమయంలో సుమారు 30 ఏళ్ల యువకుడు పట్టాలపై పడుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. యువకుడు ఒంటిపై నీలం రంగు అడ్డచారల చొక్కా, మిలటరీ రంగు ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. కుడి చేయి మణికట్టుపై ఈశ్వర్ అనే పచ్చబొట్టు ఉంది. మృతుడి వివరాలు తెలిసినవారు 0883-2442821, 89193 09442 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని హెచ్‌సీ కోరారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

రాజమహేంద్రవరం నేరవార్తలు: ఆనందనగర్‌కు చెందిన జి.శంకర్(46) ఈ నెల 18వ తేదీ నుంచి కనిపించడం లేదని అతడి భార్య వెంకటలక్ష్మి సోమవారం మూడో పట్టణ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని గాయాలు

లాలాచెరువు ప్రాంతానికి చెందిన టి.దుర్గాప్రసాద్ ద్విచక్ర వాహనంపై ఆటోనగర్ రోడ్డులో ఆదివారం రాత్రి వెళ్తుండగా లారీ ఢీకొంది. ఆ ప్రమాదంలో అతడి కాలికి తీవ్ర గాయం కావడంతో నగరంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి వర్గాలు బొమ్మూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అమలుకు డిమాండ్

వి.ఎల్.పురం: మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం హామీని వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా, నగర కమిటీ, మహిళా విభాగం సంయుక్త ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు టి.కె.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి అమర్ జహాబేగ్, ప్రధాన కార్యదర్శి అరుణకుమారి, మహిళా విభాగం అధ్యక్షురాలు మోత శారద, పార్టీ నగర అధ్యక్షుడు మురళీధర్, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

అమర జవాన్లకు నివాళి



నివాళి అర్పిస్తున్న కమాండెంట్ ధర్మ ప్రకాష్

దానవాయిపేట(రాజమహేంద్రవరం): పోలీసు అమరవీరులను స్మరించుకోవాల్సిన తరుణమిదని సీఆర్‌పీఎఫ్ 42వ బెటాలియన్ కమాండెంట్ ధర్మ ప్రకాష్ పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని రాజమహేంద్రవరం పోలీసు శిక్షణ కార్యాలయం ఆవరణలో బెటాలియన్ అధికారులు సోమవారం నిర్వహించారు. అమర జవాన్లకు నివాళి అర్పించారు. డిప్యూటీ కమాండెంట్ బి.రత్నమ్మ, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంకల్ప బలంతోనే లక్ష్య సాధన

రాజమహేంద్రవరం సాంస్కృతికం: మహిళల్లో సంకల్ప బలం ఉంటే అనుకున్న లక్ష్యం చేరడానికి అవకాశం ఉంటుందని, అందుకు తానే ఉదాహరణ అని ఆంధ్రా విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్ సీతామాణిక్యం పేర్కొన్నారు. సి.పి.రెడ్డి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు లాలాచెరువు స్వర్ణాంధ్రా వృద్ధాశ్రమంలో సోమవారం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె స్వర్ణాంధ్ర సంస్థ సేవలను కొనియాడారు. సీతామాణిక్యాన్ని సంస్థ నిర్వాహకుడు గుబ్బల రాంబాబు సత్కరించారు.



సీతామాణిక్యాన్ని సత్కరిస్తున్న రాంబాబు, తదితరులు

నగరంలో పారిశుద్ధ్య సిబ్బందిని పెంచాలి

వి.ఎల్.పురం: జనాభా ప్రాతిపదికన నగరంలో పారిశుద్ధ్య సిబ్బందిని పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు టి.మధు డిమాండ్ చేశారు. సీతంపేటలో సోమవారం జరిగిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న ఒప్పంద, పొరుగు సేవల కార్మికులను తక్షణం క్రమబద్ధీకరించాలని, సిబ్బందిని పెంచి పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నెల 25న తాడితోట అంబల్ల సూర్యారావు భవన్‌లో జరిగే ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు హాజరుకానున్నట్లు మధు తెలిపారు.

అదుపు తప్పిన లారీ



దానవాయిపేట: నగర శివారులో ఓ లారీ సోమవారం అర్ధరాత్రి అదుపుతప్పింది. జాతీయ రహదారిపై హుకుంపేట నుంచి బొమ్మూరు వెళ్లే మార్గంలో డివైడర్‌పై రెయిలింగ్‌ను ఢీకొని ఓ బాణసంచా దుకాణం సమీపంలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

మోస్తరు వర్షానికే మురుగుమయం!

ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: నగరంలో సోమవారం సాయంత్రం కురిసిన మోస్తారు వర్షానికే నగరంలోని ఆల్కట్‌తోట ప్రాంతాల్లో కాలువలు పొంగి వీధులు, ప్రధాన దారులను మురుగు ముంచెత్తింది. దీంతో వాహన చోదకులు, పాదచారులు రాకపోకలకు తీవ్ర అవస్థ పడ్డారు. వర్షం కురిసిన ప్రతిసారీ ఇబ్బందులు తప్పడం లేదని, అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని నివాసితులు కోరుతున్నారు.



కాలువ చెత్తతో నిండి వీధిని ముంచెత్తిన మురుగు



ఆల్కట్‌తోట ప్రధాన రహదారిపై చేరిన మురుగు

23న ప్రాంగణ ఎంపికలు



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపల్

రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఈ నెల 23వ తేదీ ఉదయం 10 గంటల నుంచి దివీస్ లాబ్స్‌లో ట్రైనీ సూపర్‌వైజర్లు, గ్రాడ్యుయేట్ అప్రంటిస్ పోస్టులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ కె.రామచంద్రరావు తెలిపారు. దీనికి 2020 నుంచి 2024 మధ్య బీఎస్సీ కెమిస్ట్రీ, బి-ఫార్మసీ, ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, అనలిటికల్ కెమిస్ట్రీ, ఎంఫార్మసీ, బీటెక్ కెమికల్‌లో ఏదైనా ఒకటి ఉత్తీర్ణులైన పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు తమ అర్హత ఒరిజినల్ సర్టిఫికెట్లు, నకలు కాపీలతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ప్రాంగణ ఎంపికలకు హాజరుకావచ్చని తెలిపారు.

కళాశాల కబుర్లు

అవయవదానంపై అవగాహన

కళాశాల ఆంగ్ల విభాగం, విశాఖకు చెందిన సావిత్రిబాయి పులే ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త(స్వెక్ట్) ఆధ్వర్యంలో శరీర, అవయవ దానంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ అవయవ దానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. స్వెక్ట్ ఛైర్‌పర్సన్ సీతామహాలక్ష్మి, ప్రిన్సిపల్ సెక్రటరీ వి.వినోద్‌బాలు మాట్లాడుతూ అవయవ, రక్త, నేత్రదానాల్లో పాల్గొనేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ఆంగ్ల విభాగాధిపతి ఎం.శ్రీలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, దేవీచౌక్

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

రైతుబజారులో నిన్నటి ధరలు(రూ.లలో)

దేవిచౌక్: టమాట-36, వంకాయలు (నలుపు-34, గులాబీ-45, తెలుపు-34, దొమ్మేరు-48), బెండ-36, కాకర-28, బీర (పందిరి-35, పొట్టి-30), దొండ-24, క్యారెట్-44/మధ్యరకం-40, బీట్‌రూట్-40, గోరుచిక్కుళ్లు-32, చేమ-34, ఆనపకాయ-28, 30, చిక్కుళ్లు-90, దేశవాళీ-96, పచ్చిమిర్చి-38, బంగాళదుంపలు-33.

సినిమాలు

దానవాయిపేట: శ్యామల: వేట్టయన్, ఊర్వశి: సత్యం సుందరం, సూర్యప్యాలెస్: ఇద్దరు, రాజా: మార్టిన్, కుమారి, అప్సర: దేవర, అశోక్: విశ్వం, స్వామి: స్వాగ్, అన్నపూర్ణ: జనక అయితే గనక, సూర్యమినీ: జిగ్రా, శివజ్యోతి: మార్టిన్, రంభ: రాధే కృష్ణ మనాన్న, నూతన్ హీరో(రెండేసి ఆటలు), మేనక: కల్లు కాంపౌండ్, మార్టిన్(రెండేసి ఆటలు), వీనస్ మహల్: వేట్టయన్, విశ్వం(రెండేసి ఆటలు).

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

కడియం, న్యూస్‌టుడే: మురమండలో ప్రాశస్త్యం కలిగిన మసనర అమ్మవారి ఆలయం పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సోమవారం ఉదయం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఎన్నారై దంపతులు ప్రత్తిపాటి వెంకటజనార్దన చౌదరి, వీరభద్రేశ్వరి దంపతులు భూమి పూజను నిర్వహించారు. ప్రత్తిపాటి రామారావుచౌదరి, మాదారావు, శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.


మురమండలో భూమిపూజ

మేమున్నాం.. మీకు తోడుగా

గుంతలు పూడ్చండి

సమస్య: చక్రద్వారబంధం గ్రామ శివారున జాతీయ రహదారి సమీపంలో రహదారి గుంతలమయమై రాకపోకలకు చాలా ఇబ్బందిగా ఉంది. అధికారులు స్పందించి వెంటనే గుంతలు పూడ్చాలి.
-కె.వెంకటసుబ్బారావు, చక్రద్వారబంధం

సమాధానం: ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.
-కె.లక్ష్మి, ఈఈ(ఆర్‌అండ్‌బీ), రాజానగరం
- న్యూస్‌టుడే, రాజానగరం

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ధవళేశ్వరం: 91212 29057, కడియం: 91212 29062, అనపర్తి: 91000 20947

అధికారుల బాధ్యతల స్వీకరణ

బిక్కవోలు: బిక్కవోలు మండలానికి కొత్త ఎంపీడీవో వి.శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో ర్యూన్సీ రాజానగరం బదిలీపై వెళ్లారు.

ధవళేశ్వరం: రాజమహేంద్రవరం గ్రామీణ తహసీల్దారుగా పీవీవీ జయ సూర్యకుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు అల్లూరి సీతారామరాజు జిల్లాలో తహసీల్దారుగా పనిచేశారు. ఐటీడీఏ జరిగిన సాధారణ బదిలీలలో ఇక్కడ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేసిన జె.రమ్య పౌరసరఫరాలశాఖకు సీఎస్ డీటీగా బదిలీపై వెళ్లారు.

చంటియ్య కుటుంబానికి పలువురి పరామర్శ

కడియం: నర్సరీ రంగంలో నిత్య కృషీవలుడిగా పుల్లా సత్యనారాయణ (చంటియ్య) ఖ్యాతిని గడించారని.. ఆయన లేని లోటు తీరనిదని గ్రామీణ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. సోమవారం చంటియ్య కుటుంబాన్ని పరామర్శించి.. చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. అలాగే, రాజమహేంద్రవరం మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, చందన నాగేశ్వర్, మాజీ ఎంపీ గిరజాల వెంకటస్వామినాయుడు, జగ్గంపేట జనసేన పార్టీ ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేశ్, రావిపాటి రామచంద్రరావు తదితరులు వేర్వేరుగా చంటియ్య కుటుంబాన్ని పరామర్శించారు.

పశు పోషణకు ప్రత్యేక కమిషన్

• ఔత్సాహికులకు రాయితీ ప్రోత్సాహం • పశు సంవర్ధకశాఖ దరఖాస్తుల స్వీకరణ

సీతానగరం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో చిన్న, సన్నకారు రైతులకు వ్యవసాయంతోపాటు పశుపోషణే ఆధారం. ఈ రంగాన్ని వ్యవస్థీకృతం చేసి పాలు, గుడ్లు, మాంసం ఉత్పత్తులు పెంపుతోపాటు మార్కెటింగ్ సౌకర్యం మెరుగుపరిస్తే ఉపాధి అవకాశాలు పెరిగి గ్రామీణాభివృద్ధికి దోహదం పడుతుందని రాష్ట్ర ప్రభుత్వం విశ్వసిస్తోంది. ఇందులో భాగంగా జాతీయ లైవ్ స్టాక్ మిషన్ నిధులు 2021-22 నుంచి 2025-26 సంవత్సరాల కాలపరిమితిలో యూనిట్లు ఏర్పాటు చేసిన ఔత్సాహికులకు రాయితీ ఇచ్చి ప్రోత్సహిస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మేకలు, గొర్రెలు 4.5 లక్షలు ఉంటే ఔత్సాహికులకు రాయితీ ఇవ్వడం ద్వారా వీటిని 10 లక్షలకు పెంచాలనే లక్ష్యంతోపాటు కోళ్ల యూనిట్లకు రాయితీ పెంచి అందించనున్నారు.

దేశీయ కోళ్లకు..

1000 పెరటికోళ్లు, కోడిపిల్లల ఉత్పత్తి, పొదుగు కోళ్ల యూనిట్‌కు రూ.50 లక్షలు, అంతకుమించి పెట్టుబడి అయితే గరిష్ఠంగా రూ.25 లక్షలు రాయితీ ఇస్తారు. పందుల పెంపకంలో 50 ఆడ, అయిదు మగ లేదా 100 ఆడ, 10 మగపందులతో కూడిన యూనిట్‌కు రూ.30-60 లక్షలు పెట్టుబడి అయితే రూ.15 లక్షల నుంచి రూ.30 లక్షల రాయితీ అందించనున్నారు.

గొర్రెలు, మేకల పెంపకంపై..

యూనిట్ స్థాయి ఆడ	మగ	రాయితీ (ప్రాజెక్టు వ్యయంలో సగం) (రూ.లక్షలు)
100	05	10
200	10	20
300	15	30
400	20	40
500	25	50



పశుగ్రాసం, దాణా అభివృద్ధికి: సైలేజ్, గ్రాసం దిమ్మెలు, సమీకృత దాణా తయారీ యూనిట్లకు పెట్టుబడి రూ.కోటి అంతకు మించితే గరిష్ఠంగా రూ.50 లక్షలు రాయితీ అందిస్తారు.

ఎవరిని ఎంపిక చేస్తారంటే..!

ఈ దేశ పౌరుడై ఒకరు లేదా ఇద్దరు కలిసి ఏర్పాటు చేసినా లేదా సంఘాలు కంపెనీల ద్వారా ఏర్పాటు చేయవచ్చు. వయస్సు 65 ఏళ్ల లోపు ఉండాలి. సొంతంగా లేదా అద్దెకు తీసుకున్న భూమి ఉండాలి. జీవాల పెంపకంలో అనుభవం ఉండాలి. నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ప్రాజెక్టు నివేదిక పోర్టల్లో అప్‌లోడ్ చేయాలి. రాయితీ పోను మిగిలిన పెట్టుబడి కోసం రుణం పొందేందుకు బ్యాంకు అనుమతి తప్పనిసరి.

ఎన్ని యూనిట్లైనా ఏర్పాటు చేసుకోవచ్చు

జాతీయ లైవ్ స్టాక్ మిషన్ (ఎన్‌ఎల్‌ఎం) ద్వారా ఎంతమందికైనా పథకం మంజూరు చేసేలా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. వీటిపై ఇప్పటికే ఆయా పశువైద్యశాలల వద్ద రైతులకు అవగాహన పెంచుతున్నాం. యూనిట్లు ఏర్పాటుచేసుకుని వివరాలను పశుసంవర్ధకశాఖ సూచించిన పోర్టల్లో అప్‌లోడ్ చేసి రాయితీ పొందవచ్చు.
- డాక్టర్ మక్కిన వెంకటేశ్వర్లు, ఉప సంచాలకులు, పశుసంవర్ధకశాఖ, తూర్పు గోదావరి జిల్లా

ఇళ్ల మధ్య మద్యం దుకాణం వద్దు

బొమ్మూరు, న్యూస్‌టుడే: బొమ్మూరు చెరువుగట్టు ప్రాంతంలో మద్యం దుకాణం అనుమతులు నిలిపివేయాలని బొమ్మూరు ప్రశాంతినగర్, చెరువుగట్టు ప్రాంతవాసులు కలెక్టర్ ప్రశాంతిని కోరారు. కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఆమెను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. నివాసాల మధ్య మద్యం దుకాణం ఉండటం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. మద్యం మత్తులో కొందరు దొంగతనాలు, దాడులకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ విచారణ జరుపుతామని, ఎక్సైజ్ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కాగా సాయంత్రం ఎక్సైజ్ సిబ్బంది మద్యం దుకాణం వద్ద పరిస్థితిని పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమీపంలో ప్రైవేటు పాఠశాల, నివాసాలు ఉన్నాయని అధికారులు ఏ విధంగా అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేస్తామని సిబ్బంది తెలిపారు.


కలెక్టర్‌తో మద్యం దుకాణం సమస్యపై మాట్లాడుతున్న బొమ్మూరు కాలనీవాసులు

నేటి నుంచి ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధం

గోకవరం, న్యూస్‌టుడే: అస్సాగో ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధమవుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మరోతి శివగణేష్ తెలిపారు. మంగళవారం ఉదయం నుంచి గుమ్మళ్లదొడ్డిలో ఈ దీక్ష చేపట్టనున్నారు. ఇదిలా ఉండగా సోమవారం సాయంత్రం స్థానికంగా కలిసి కాకినాడ జిల్లా తెదేపా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పరిశ్రమను సందర్శించారు.

ప్రణాళికాబద్ధంగా గ్రామాల అభివృద్ధి: గోరంట్ల

కడియం: ప్రణాళికాబద్ధమైన కార్యాచరణతో గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని గ్రామీణ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి కొనియాడారు. సోమవారం ఉదయం ఆయన మురమండ, కడియపులంకలో జరిగిన పల్లె పండుగకు ముఖ్య అతిథిగా ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్‌తో కలిసి పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల పురోగతిపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని వివరించారు. ఆ కోవలోనే మురమండలో రూ.13లక్షలు, కడియపులంకలో రూ.2.49 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు వంటి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. గత పాలకులు నర్సరీ రంగాన్ని నిర్వీర్యం చేశారన్నారు. నర్సరీ రైతులకు అందాల్సిన రాయితీలను ఎగ్గొట్టారని విమర్శించారు. వాసిరెడ్డి రాంబాబు, ప్రత్తిపాటి రామారావుచౌదరి, పాటంశెట్టి రాంజీ, మజ్జి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.


కడియపులంక నిర్మాణపనుల శంకుస్థాపనలో ఎమ్మెల్యే గోరంట్ల

మెట్ట రైతులకు రాయితీపై శనగ విత్తనాలు: నల్లమిల్లి

రంగంపేట, న్యూస్‌టుడే: మెట్ట రైతులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా చేయూతను అందిస్తుందని, అందులో భాగంగానే రాయితీపై శనగ విత్తనాలను అందిస్తున్నట్లు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం రంగంపేట మండలం కోటపాడులో చంద్రేడు, రంగంపేట, పెదరాయవరం, కోటపాడు రైతులకు 25శాతం రాయితీపై శనగ విత్తనాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. జిల్లా తెదేపా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవిందు, జడ్పీటీసీ సభ్యుడు రాంబాబు, జనసేన కన్వీనరు ఆర్.నాగు, పోతుల వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.

☛ రంగంపేటలో మూడు రోజులుగా పల్లె పండుగ కార్యక్రమానికి గైర్హాజరైన పంచాయతీరాజ్ డీఈ శ్రీరామకృష్ణపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరు సమావేశం ఉండటంతో తాను ఆ సమావేశానికి వెళ్లానని డీఈ సమాధానమివ్వగా.. తాను కలెక్టర్‌తో మాట్లాడితే ఏ సమావేశమూ నిర్వహించలేదని చెప్పారంటూ ఎమ్మెల్యే ప్రస్తావించారు.

☛ అనపర్తి గ్రామీణం: భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా అనపర్తి మండలం రామవరంలో సోమవారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కన్వీనర్ శివరామకృష్ణంరాజు నుంచి భాజపా క్రియాశీల సభ్యత్వం తీసుకున్నారు. ☛ పెదపూడి: మండలంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పైన, సంపర, శహపురం, వేంద్ర, కైకవోలు, పెదపూడి, కరకుదురు గ్రామాల్లో పలు రహదారుల అభివృద్ధికి ఎమ్మెల్యే భూమి పూజలు చేశారు.


కోటపాడులో శనగ విత్తనాలను అందజేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

గ్రామగ్రామాన పల్లె పండగ

కోరుకొండ, న్యూస్‌టుడే: కోరుకొండ మండలంలోని గ్రామగ్రామాన సోమవారం పల్లె పండగ కార్యక్రమం సందడిగా జరిగింది. దోసకాయలపల్లి, బుచ్చెంపేట, గుమ్ములూరు, మధురపూడి, గాదరాడ గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పాల్గొని పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీవీఆర్ చౌదరి, భాజపా కన్వీనర్ నీరుకొండ వీరన్నచౌదరి, పీడీటీ చౌదరి తదితరులు పాల్గొన్నారు.


సీసీ రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తదితరులు


కోరుకొండలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం ర్యాలీ


బిక్కవోలులో..


అనపర్తిలో..

అమరవీరుల సంస్మరణ

బిక్కవోలు, కోరుకొండ, అనపర్తి, దానవాయిపేట, న్యూస్‌టుడే: పోలీసుల ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ సోమవారం జరిగింది. బిక్కవోలులో ఎస్సై రవిచంద్రకుమార్ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద మానవహారం చేర్పాటు చేశారు. ఇన్‌ఛార్జి తహసీల్దారు కృష్ణ తదితరులు పాల్గొన్నారు. కోరుకొండలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో.. అనపర్తిలో సీఐ సుమంత్, ఎస్సై శ్రీను నాయక్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. రాజమహేంద్రవరం పోలీసు శిక్షణ కార్యాలయం ఆవరణలో సీఆర్‌పీఎఫ్ 42వ బెటాలియన్ కమాండెంట్ ధర్మ ప్రకాష్ ఆధ్వర్యంలో బెటాలియన్ అధికారులు అమరవీరులకు నివాళి అర్పించారు.

ఆకట్టుకున్న పురాతన నాణేల ప్రదర్శన

పెదపూడి, న్యూస్‌టుడే: పెదపూడి మండలం జి.మామిడాడ జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఉపాధ్యాయుడు కె.బాలు సోమవారం ఏర్పాటు చేసిన పురాతన నాణేల ప్రదర్శన విద్యార్థులను ఆకట్టుకుంది. హెచ్ఎం కె.శ్రీనివాస్ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 135 దేశాలకు సంబంధించిన నాణేలను.. భారతదేశానికి చెందిన శాతవాహనుల కాలం నుంచి నేటి వరకు ఉన్న నోట్లు, నాణేలను ప్రదర్శనలో పెట్టారు. ఎంఈవో సి.వి.వి.సత్యనారాయణ, సర్పంచి లంక మున్నీ పాల్గొన్నారు.


పురాతన నాణేలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

గోకవరం: అయిదేళ్ల లోపు చిన్నారులకు కొత్త ఆధార్ నమోదు, పుట్టిన తేది, చిరునామా తదితర వివరాలు మార్పులకు ప్రత్యేక ఆధార్ శిబిరాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో గోవింద్ తెలిపారు. ఈనెల 22 నుంచి ప్రారంభమై 25 వరకు ఆయా గ్రామాలలో సచివాలయాల వద్ద ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతాయన్నారు.

హమ్మయ్య... ట్రాఫిక్ కానిస్టేబుల్ వచ్చారు

బొమ్మూరు: బొమ్మూరు జాతీయ రహదారి కూడలి అంటే ప్రజలు నిత్యం వణికిపోతుంటారు. తరచూ ప్రమాదాలు జరిగే ఇక్కడ రోజూ ట్రాఫిక్ కానిస్టేబుల్ మాత్రం ఉండేవారు కాదు. చివరకు రాత్రిపూట గస్తీ పోలీసులు కూడా ఈ కూడలిలో కనిపించని దుస్థితి. ఎట్టకేలకు అధికారులు స్పందించారు. సోమవారం సాయంత్రం బొమ్మూరు కూడలిలో పోలీసు సిబ్బంది కనిపించడంతో ఈ మార్పు ఎంతకాలం ఉంటుందో అంటూ గుసగుసలాడటం కనిపించింది. పోలీసులు మాత్రం ఇకపై రోజు ఉదయం, సాయంత్రం అందుబాటులో ఉంటామని తెలిపారు.

భాజపా మరింత బలోపేతం

గోకవరం, న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వ నమోదుకు విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు ఎంతో కృషి చేశారని.. ఆయన సేవలతో పార్టీ మరింత బలోపేతమవుతుందని భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేటుకూరి సూర్యనారాయణరాజు అన్నారు. తంటికొండకు వెళ్లే దారిలో ఉన్న సీఎండీ కేఎస్‌పీవీ లేఅవుట్ కార్యాలయంలో సోమవారం ఆయన కంబాల శ్రీనివాసరావును కలిశారు. వరాలబాబు, మట్టా మంగరాజు, సత్తి వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

రీసర్వే సమస్యలకు పరిష్కారం

బొమ్మూరు: రైతులకు తమ పొలాలు, స్థలాల్లో రీసర్వే వల్ల తలెత్తిన సమస్యలు పరిష్కరిస్తామని డిప్యూటీ తహసీల్దారు రాజబాబు తెలిపారు. బొమ్మూరు పంచాయతీ ఆవరణలో సోమవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. సర్వేయర్ భువనేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. బొమ్మూరు, రాజవోలు గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమం మంగళవారం నిర్వహిస్తారని ఎంపీడీవో శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బొమ్మూరు వడ్డేవీరభద్రనగర్‌లో ఉదయం 10 గంటలకు, అనంతరం రాజవోలులో కార్యక్రమాలకు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పాల్గొంటారన్నారు.

రాజానగరంలో రెవెన్యూ సదస్సులు ఇలా..

రాజానగరం: రాజానగరం పరిధిలో 22, 23 తేదీలలో నామవరం, 24, 25 తేదీలలో రాజానగరం, 25, 26 తేదీలలో నందరాడ, 28, 29న జి.యర్రంపాలెం, 29, 30న శ్రీకృష్ణపట్నం, నవంబరు 4, 5 తేదీలలో నరేంద్రపురం, 6, 7న కొండగుంటూరు, 11, 12న వెలుగుబంద, 13, 14న కలవచర్ల, 15, 16న పాతతుంగపాడు, 18, 19న కానవరం, 20, 21 తేదీలలో పాలచర్లలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దారు లక్ష్మీ లావణ్య తెలిపారు.

పిస్టల్ షూటింగ్‌లో ఓవరాల్ ఛాంపియన్ తూర్పుగోదావరి జిల్లా

సంపతనగరం (రాజానగరం), న్యూస్‌టుడే: సంపతనగరంలోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహిస్తున్న 68వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల రైఫిల్ షూటింగ్ వ్యక్తిగత పోటీలు సోమవారం ముగిశాయి. ఇందులో భాగంగా సోమవారం నిర్వహించిన పిస్టల్ క్యాటగిరీలో అండర్-14, 17, 19 విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన తూర్పు గోదావరి జిల్లా జట్టు ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచిందని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ స్వామి తెలిపారు. అండర్-14 బాలికల విభాగంలో మొదటి రెండు స్థానాలు తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఎన్.దీక్షిత, టి.కె.అక్రాతి గెలుచుకున్నారు. పీప్ క్యాటగిరీ పోటీలు ఈ నెల 27వ తేదీన ఇదే పాఠశాల ప్రాంగణంలో నిర్వహిస్తారన్నారు. జాతీయ స్థాయి పోటీలు డిసెంబరులో మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో నిర్వహిస్తారని ఆయన వివరించారు.


పిస్టల్ షూటింగ్‌లో ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచిన తూర్పుగోదావరి జిల్లా జట్టు

చోరీలకు పాల్పడిన వ్యక్తి అరెస్టు

అనపర్తి గ్రామీణం: అనపర్తి మండలంలో పలు చోరీలకు పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ సుమంత్, ఎస్సై శ్రీనునాయక్ తెలిపారు. సెప్టెంబరు 28తేదీ రాత్రి అనపర్తి ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ఉన్న జ్యువెలరీ వర్క్ దుకాణంలోను, ఈ నెల10న కుతుకులూరు గ్రామంలోని పులగం వెంకటరెడ్డి నివాసంలో చోరీలకు పాల్పడిన డా.బీఆర్‌అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం వెదురుపాక గ్రామానికి చెందిన కట్టాశివశంకర్ అనే వ్యక్తిని అరెస్టు చేశామన్నారు. చోరీ చేసిన 211 గ్రాముల వెండి వస్తువులు, 12 గ్రాముల బంగారు అభరణాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుణ్ని అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించారని, రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించినట్లు వివరించారు. కట్టాశివశంకర్‌పై సుమారు 50 పాతకేసులు ఉన్నట్లు చెప్పారు.


నిందితుడు, స్వాధీనం చేసుకున్న అభరణాలతో పోలీసులు

ప్రకటన

ది ఆంధ్ర పేపర్ లిమిటెడ్, రాజమండ్రి వారి సంజాయిషీపై యావన్మందికి ఈవిధంగా తెలియచేయునది ఏమనగా, కడియం మండలం, జేగురుపాడు వాస్తవ్యులు ఈ నోటీసు షెడ్యూలు ఆస్తి అనగా కడియం మండలంలో జేగురుపాడు గ్రామములో య. 14.5370 సెంట్లు క్రింది షెడ్యూలులో వివరముగా ఉదహరించిన భూమికి (1) అరదాడ వెంకటేశ్వరరావు, S/o. లేటు రామస్వామి, (2) అరదాడ మహాలక్ష్మి, W/o. అరదాడ శంకరరావు, (3) అరదాడ లూర్థుమేరి, W/o. లేటు గంగాధరరావు, (4) అరదాడ సంతోషివాణి, W/o. late పుష్కరం, (5) అరదాడ రమేష్‌కుమార్, S/o. late ఎ.గంగాధరరావు, (6) అరదాడ నందకుమార్, S/o. late ఎ.గంగాధరరావు, (7) అరదాడ రాధాబాయి, W/o. late వీరభద్రరావు, (8) అరదాడ రామ్‌ప్రసాద్, S/o. late వీరభద్రరావు, (9) అరదాడ శ్రీనివాసరావు, S/o. late వీరభద్రరావు, (10) అరదాడ వి.వి.సత్యనారాయణరావు, S/o. ఎ.వెంకటేశ్వరరావు, (11) చింతా సీతాలక్ష్మి, D/o. అరదాడ వెంకటేశ్వరరావు, (12) అరదాడ రాజేశ్వరి, D/o. శంకరరావు, (13) అరదాడ శ్రీదేవి, D/o. శంకరరావు అనువార్లు ఈక్రింది షెడ్యూలు భూమికి హక్కుదార్లు అనియూ (అనగా Oweners) వారికి సంపూర్ణ హక్కులు సదరు భూమిపై వున్నాయని మరియు ఈక్రింది ఆసాములు అనగా (1) గిరిజాల వీర్రాజు, S/o. late జి.కృష్ణారావు, (2) గిరిజాల వెంకటేశ్వరరావు, S/o. late జి.కృష్ణారావు, (3) తుమ్మ సత్యవేణి, D/o. late గిరిజాల కృష్ణారావు, (4) గిరిజాల వెంకటస్వామి నాయుడు, S/o. late జి.వీర్రాజు, (5) గిరిజాల నాగేశ్వరరావు, S/o. late జి.వీర్రాజు, (6) గిరిజాల వెంకట సూర్య ప్రభాకరరావు, S/o. late వీర్రాజు, (7) సూరపురెడ్డి మంగతాయారు, W/o. చిన వీరాస్వామి, (8) మల్లిపూడి సూర్యవతి, W/o. భాస్కరరావు, (9) పోతుల శ్రీలక్ష్మి, W/o. సుబ్బారావు సదరు షెడ్యూలులో తెలిపిన భూములకు స్వాధీనంలో ఉన్నారు అనియు సదరు భూమిని వారి స్వాధీనంలో ఉన్నట్లుగా చెప్పుచున్నారు. సదరు పై అసాములందరూ అనగా భూమి హక్కుదారులు, భూమి స్వాధీనంలో ఉన్నవారు సదరు ఆంధ్ర పేపర్ లిమిటెడ్, రాజమండ్రి వారికి క్రియం చేయుటకు ఒప్పుకొని సదరు కంపెనీ వారితో సంప్రదింపులు చేయుచున్నారు. కావున సదరు షెడ్యూలు ఆస్తిపై ఎవరికైననూ ఏమైనా ఇతరులకు ఏవిధమైన అభ్యంతరములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన ఏడు రోజులలో వ్రాతపూర్వకంగా అట్టి హక్కులు గల దస్తావేజులు కాపీలతో అభ్యంతరములు సదరు పైన తెలిపిన కంపెనీ వారికి గాని, లేదా ఈక్రింది తెలిపిన అడ్రస్ ప్లీడరు గారిని గాని తెలియచేయవలసినదిగా కోరడమైనది. లేని యెడల సదరు షెడ్యూలు ఆస్తిపై ఏవిధమైన అభ్యంతరములు లేవని భావించి సదరు కంపెనీ వారు పైన తెలిపిన ఆసాముల వద్ద నుండి క్రియం పొందుదురని తెలియచేయడమైనది. ఆపైన వచ్చిన ఏవిధమైన అభ్యంతరములు సదరు కంపెనీ వారిపై బైండ్ చేయవని మరియు చెల్లనేరవని తెలియచేయడమైనది.

షెడ్యూలు

Description of the agricultural land

S. No.	Survey Number	Area	New L.P Number	Name
1	11/3	3.3080	3529	Aradada Venkateswara Rao
		0.0670	3530	Aradada Mahalakshmi
2	11/4	0.5700	93	Aradada Mahalakshmi
3	12/9	0.9680	3527	Aradada Mahalakshmi
		0.2250	3528	Aradada Venkateswara Rao
4	15/8	1.8470	3533	Aradada Mahalakshmi
		1.7110	3534	Aradada Lourdu Mary
		0.2900	3535	Aradada Lourdu Mary
5	15/10	0.1990	165	Aradada Lourdu Mary
6	15/20	0.5730	82	Aradada Srinivas Rao
7	15/19	2.9000	3531	Aradada Srinivas Rao
		0.076	3532	Aradada Lourdu Mary
8	15/14 and 16	0.9270	3543	Aradada Srinivas Rao
		0.5400	3544	Aradada Lourdu Mary
		0.1290	3545	Aradada Venkateswara Rao
		0.2070	3546	Aradada Mahalakshmi
		14.5370		

పి.వి.రామచంద్రరావు, అడ్వకేట్
డో.నెం. 47-2-1సి, గాంధీపురం-1
రాజమండ్రి-533103, సెల్: 9397906929
రాజమండ్రి
ది.21-10-2024


విజేతలకు సత్యసాయి గురుకులం పాఠశాల ప్రిన్సిపల్ కె.గుర్రయ్య బహుమతుల ప్రదానం


శ్రీ షిర్డీసాయి పాఠశాల డీన్ కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో..

పోటీతత్వంతోనే ప్రతిభ.. సృజనాత్మకత

శ్యామలా సెంటర్: విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు పోటీలు దోహదపడతాయని శ్రీ సత్యసాయి గురుకులం పాఠశాల ప్రిన్సిపల్ కె.గుర్రయ్య, పోటీతత్వంతోనే బాలల్లో సృజనాత్మకత బయటకొస్తుందని శ్రీ షిర్డీసాయి పాఠశాల డైరెక్టర్ టి.శ్రీవిద్య అన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో ఈ పాఠశాలల్లో సోమవారం జరిగిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శ్రీ సత్యసాయి గురుకులంలో నిర్వహించిన పోటీల్లో సాహిల్ కుమార్(పదో తరగతి), వై.ఝాన్సీ(తొమ్మిదో తరగతి), ఎ.దేవ హర్ష(ఎనిమిదో తరగతి) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి 'ఈనాడు' సమకూర్చిన బహుమతులను ప్రిన్సిపల్ కె.గుర్రయ్య, కరస్పాండెంట్ ఎ.శ్యాంసుందర్ అందజేశారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా కె.ఎస్.కవితాదేవి, సి.కరుణ, కె.విజయలక్ష్మి వ్యవహరించారు.

శ్రీ షిర్డీసాయి పాఠశాలలో.. : షిర్డీ పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో కె.లాస్య ప్రశాంతి(తొమ్మిదో తరగతి), జి.జీవన జిత్య(పదో తరగతి), ఎ.శ్రీనిధి(ఎనిమిదో తరగతి) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి 'ఈనాడు' సమకూర్చిన బహుమతులను పాఠశాల డైరెక్టర్ టి.శ్రీవిద్య, డీన్ కె.శ్రీనివాస్ అందించారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా వి.రవిప్రకాష్, కె.శివప్రసాద్‌లు వ్యవహరించారు.

విద్యార్థిని మృతికి నన్నయలో సంతాపం

నన్నయ విశ్వవిద్యాలయం (రాజానగరం), న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో పీజీ విద్యార్థిని కుంచే పల్లవి మృతి చెందడం పట్ల నన్నయ విశ్వవిద్యాలయం సోమవారం తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. పల్లవి మృతికి సంతాపం ప్రకటిస్తూ సోమవారం విశ్వవిద్యాలయంలో సైన్స్ అండ్ టెక్నాలజీ భవన ప్రాంగణంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపల్ డా.పి.విజయనిర్మల, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పల్లవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


పల్లవి మృతికి సంతాపం వ్యక్తం చేస్తున్న వీసీ తదితరులు

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

వి.ఎల్.పురం (రాజమహేంద్రవరం): రైలు కిందపడి గుర్తుతెలియని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ వద్ద సోమవారం ఈ సంఘటన చోటు చేసుకుంది. జీఆర్పీ హెచ్‌సీ మణి తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వేస్టేషన్‌లో రెండో నంబరు ప్లాట్‌ఫామ్ వద్ద ఉదయం గూడ్సు రైలు వచ్చే సమయంలో సుమారు 30 ఏళ్ల యువకుడు పట్టాలపై పడుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. యువకుడు ఒంటిపై నీలం రంగు అడ్డచారల చొక్కా, మిలటరీ రంగు ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. కుడి చేయి మణికట్టుపై ఈశ్వర్ అనే పచ్చబొట్టు ఉంది. మృతుడి వివరాలు తెలిసినవారు 0883-2442821, 89193 09442 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని హెచ్‌సీ కోరారు.

పోలీసుల అదుపులో 11 మంది జూదరులు

అనపర్తి గ్రామీణం: అనపర్తి ధరణికోటలోని ఓ ఇంట్లో జూదం ఆడుతున్న 11 మంది అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై శ్రీను నాయక్ సోమవారం రాత్రి తెలిపారు. తమకు వచ్చిన సమాచారంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా.. 11 మంది పట్టుబడ్డట్లు చెప్పారు. రూ.16,600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

చాగల్లు: ఆధార్ ప్రత్యేక శిబిరాలను కొవ్వూరు పట్టణంలో మంగళవారం నుంచి 25వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జి.నాగేంద్రకుమార్ తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి శిబిరం ప్రారంభమవుతుందన్నారు. తొలిరోజు శ్రీరామకాలనీలోని ఒకటో సచివాలయం, 23న ప్రభుత్వ జూనియర్ కళాశాల, 24న మున్సిపల్ ఉన్నత పాఠశాల, 25న ఇందిరమ్మకాలనీలోని 9వ సచివాలయంలో ఈ శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

తాళ్లపూడి: మండల పరిధిలోని గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నామని, ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీడీవో రమణ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఇందులో భాగంగా తాళ్లపూడిలోని సచివాలయం-12, వేగేశ్వరపురం-12, మలకపల్లి, పెద్దేవం, రావులపాడులో మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరం కొనసాగుతుందన్నారు.

కొవ్వూరు

•కొవ్వూరు •నిడదవోలు •గోపాలపురం

ధ్వజస్తంభ ప్రతిష్ఠ

నిడదవోలు: మండలంలోని రావిమెట్లలో సోమవారం నంగామమ్మ ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు, వేదిశెట్టి ఉప సర్పంచి బూరుగుపల్లి శ్రీనివాసరావు తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు.

శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి



పెరవలి, న్యూస్‌టుడే: పెరవలి ఎస్సైగా ఎం.వెంకటేశ్వరరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఆయన తెలిపారు.



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

వ్యాసం రాసి.. ప్రతిభ చాటి



విజేతలతో ప్రధానోపాధ్యాయిని గంగాభవాని

చాగల్లు: 'ఈనాడు' ఆధ్వర్యంలో కొవ్వూరులోని పండిత మదన మోహన మాలవ్య మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగంపై లాభాలు, నష్టాలు' 'విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రథమ స్థానంలో 9వ తరగతి విద్యార్థిని 'షేక్ షిఫా' జువేరియా, ద్వితీయ స్థానంలో పదో తరగతి విద్యార్థిని వై.మధుప్రియ, తృతీయ స్థానంలో ఎనిమిదో తరగతి విద్యార్థి ఎం.మహేష్ నిలిచారు. వారికి ప్రధానోపాధ్యాయురాలు వి.గంగాభవాని బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సొంత గూడు దిశగా అడుగులు

అసంపూర్తి అంగన్‌వాడీ భవనాలకు మోక్షం

న్యూస్‌టుడే, తాళ్లపూడి

అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత గూడు సమకూరుస్తామని, అవసరమైన భవనాలు మరమ్మతులు చేయిస్తామని గొప్పలు చెప్పిన గత పాలకులు నిధులు మాత్రం విదల్చలేదు. ఫలితంగా నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. సొంత భవనాలు మరమ్మతులు చేపట్టేందుకు సిద్ధం చేసిన ప్రతిపాదనలు దస్త్రాలకే పరిమితమయ్యాయి. చిన్నారులు, అంగన్‌వాడీ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కదలిక వచ్చింది. అసంపూర్తి, మరమ్మతులు చేపట్టాల్సిన భవనాలపై ఇంజినీరింగ్ సహాయకులు ఎమ్మెల్యే, ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. దీంతో ఆయా పనులు పూర్తి చేసే దిశగా అడుగులు పడనున్నాయి.

కొవ్వూరు నియోజకవర్గంలో కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి మండలాల పరిధిలో సుమారు 250 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. గత వైకాపా ప్రభుత్వం నాడు-నేడు మొదటి విడతలో సొంత భవనాల నిర్మాణానికి రూ. 16 లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారు. తొమ్మిది మంది సభ్యుల కమిటీ పర్యవేక్షణలో నిర్మాణాలు జరిగేలా వర్తులు చేపట్టారు. ప్రారంభంలో స్థలాల ఇబ్బందులు ఎదురైనా నిర్మాణాలు ప్రారంభించారు. ఒక్కో దానికి సుమారు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు నిధులతో శ్లాబ్ వరకు పనులు జరిగాయి. వచ్చిన ఆ అరకొర నిధులతో కొన్ని చోట్ల మొండిగోడలకే పరిమితమయ్యాయి. గత రెండున్నరేళ్ల నుంచి నిధులు ఇవ్వకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు ముందుకు సాగలేదు. ఇప్పటికే ఉన్న సొంత భవనాలు కొన్నిచోట్ల శిథిలావస్థకు చేరాయి. వీటిని గుర్తించి నాడు-నేడు రెండో విడతలో మరమ్మతులు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అదీ కార్యరూపం దాల్చలేదు. కూటమి ప్రభుత్వం చిన్న చిన్న మరమ్మతులు చేయించి ఆకర్షణీయమైన రంగులు వేసేలా కొన్నింటిని ఎంపిక చేసింది.

నిధులివ్వక.. మరమ్మతులు చేపట్టక..

నాడు-నేడు కింద మంజూరై, అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలు

మండలం	అసంపూర్తి నిర్మాణాలు
కొవ్వూరు	–
చాగల్లు	2
తాళ్లపూడి	22
మొత్తం	24



తాళ్లపూడిలో నిలిచిన నిర్మాణం

నివేదిక అందజేశాం..

అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ నిర్మాణాలపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేశాం. స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు వివరాలు అందించాం. త్వరలో నిర్మాణాలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది

- మమ్మీ, సీడీపీవో, కొవ్వూరు

నీటి శుద్ధి పరికరం బహూకరణ

నల్లజర్ల: నల్లజర్లలోని ఉచిత కుట్టు శిక్షణ కేంద్రానికి రూ.10 వేలు విలువ చేసే తాగునీటి శుద్ధి పరికరాన్ని స్థానిక, పార్క్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ ఉపాధ్యక్షుడు పచ్చిగోళ్ల శ్రీనివాసరావు సోమవారం అందజేశారు. సంస్థ మండల శాఖ అధ్యక్షుడు మహ్మద్ షరీఫ్, అంబటి శ్రీనివాసరావు, బొందల శ్రీనివాసరావు, కూరపాటి నాగరాజు, జి.వి.వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యాగశాలలో ప్రత్యేక పూజలు

తాళ్లపూడి: తాళ్లపూడి నవదుర్గాదేవి ఆలయంలో మహాచండీయాగంలో భాగంగా శత చండీయాగం మహోత్సవాలు పురస్కరించుకుని సోమవారం యాగశాలలో ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల ఆధ్వర్యంలో గణపతిపూజ, ప్రధాన కుంభావాహన చండీ పారాయణం, మూలమంత్రహోమాలు, అగ్నిప్రతిష్ఠాపన తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అన్నసమారాధనలు

గోపాలపురం, దేవరపల్లి: దసరా మహోత్సవాలను పురస్కరించుకుని గోపాలపురంలోని యర్రంపల్లమ్మ, వాదాలకుంట దుర్గమ్మ, దొండపూడి, జగన్నాథపురం, దేవరపల్లి మండలంలో బాలదుర్గమ్మ ఆలయాల్లో సోమవారం అన్నసమారాధనలు నిర్వహించారు. భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమస్య: మండలంలోని యాదవోలులోని సొసైటీ సమీపంలో చెత్తచెదారాలు పేరుకుపోవడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో జ్వరాల బారిన పడుతున్నాం. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. – స్థానికుడు

సమాధానం: సమస్యను పరిశీలించి వ్యర్థాలను తొలగించి విధిగా చర్యలు తీసుకుంటాం. – ప్రసాద్, గ్రామ కార్యదర్శి - న్యూస్‌టుడే, దేవరపల్లి

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కొవ్వూరు: 80085 74497
నిడదవోలు: 80085 74501, గోపాలపురం: 91212 29084

మరుగుదొడ్లు తొలగించాలని ధర్నా

నిడదవోలు: పట్టణంలోని 7వ సచివాలయం వద్ద ఉన్న పబ్లిక్ మరుగుదొడ్లు తొలగించాలని కోరుతూ చర్చిపేట యూత్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్, సచివాలయ అడ్మిన్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో యు.మోషే, ఎల్లే పండు, మల్లిపూడి రాజేష్, దాకే సతీష్, నల్లా రాంబాబు, పిట్టా నాగరాజు, కె.అశోక్, నల్లా లెనిన్, తలారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న చర్చిపేట యూత్ సభ్యులు

కూటమి అభ్యర్థి విజయానికి పాటుపడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు

చాగల్లు, న్యూస్‌టుడే: శాసన మండలి ఎన్నికల్లో కూటమి అభ్యర్థి విజయానికి సమష్టిగా పాటుపడాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికలపై స్థానిక తెదేపా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విచ్చేశారు. ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామ, మండల, పట్టణ పరిధిలో సమావేశాలు నిర్వహించి పట్టభద్రులను గుర్తించి వారితో ఓటు నమోదు చేయించాలన్నారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసిన వారు, పదో తరగతి చదివి మూడు ఏళ్ల డిప్లమో చేసిన వారు కూడా అర్హులన్నారు. పేరాబత్తుల రాజశేఖర్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూటమి అభ్యర్థిపట్ల ఓటర్లు చూపిన ఆదరణ ప్రస్తుతం పట్టభద్రుల నుంచి కూడా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం రాష్ట్ర తెదేపా సీనియర్ నాయకులు పెండ్యాల అచ్చిబాబును దొమ్మేరులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణ, ఎంపీపీ కాకర్ల నారాయుడు, తెదేపా పట్టణాధ్యక్షుడు దాయన రామకృష్ణ, నాయకులు సూరపనేని చిన్ని, భాజపా నాయకులు బీవీ.ముత్యాలరావు, తదితరులు పాల్గొన్నారు.

దుర్గా మల్లేశ్వరస్వామికి విశేష అలంకరణ



ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: మండలంలోని కె.సావరంలో కొలువైన దుర్గా మల్లేశ్వరస్వామి వారికి సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, విశేష అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

భగవద్గీత పఠనంతో ప్రశాంతత

పెరవలి: భగవద్గీత పఠనంతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ట్రూత్ స్పిరిట్యువల్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు వివేకానంద తెలిపారు. పిట్టలవేమవరంలోని రెడ్డి కల్యాణ మండపంలో సోమవారం ఆయన భవద్గీత సాధ్యయోగం అనే అంశంపై ప్రచనం చేశారు. ఆయనను మల్లిడి సత్యనారాయణరెడ్డి, విజయలక్ష్మి దంపతులు, శారద, మణిమాల తదితరులు సన్మానించారు.

పారదర్శకంగా ఉపాధి పనులు

గోపాలపురం, దేవరపల్లి: ఉపాధి హామీ పనులు పారదర్శకంగా నిర్వహించాలని దేవరపల్లి ఎంపీపీ దుర్గారావు సూచించారు. గోపాలపురం, దేవరపల్లి మండలాల పరిధిలో పలు గ్రామాల్లో గత ఏడాది పనులకు సంబంధించి గ్రామసభలు నిర్వహించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే పనులపై చర్చించారు. గోకులం షెడ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్తు అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో రాణిసుస్మిత

త్వరితగతిన అర్జీల పరిష్కారానికి కృషి

చాగల్లు, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అందిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. కొవ్వూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమానికి మూడు అర్జీలు అందాయన్నారు. కొవ్వూరు మండలం చిడిపికి చెందిన ఎం.నరేంద్రనాథ్ తన ఇంటి స్థల సరిహద్దులు సర్వే చేయించాలని, దొమ్మేరుకు చెందిన యు.మంగాయమ్మ రోడ్డు నిర్మాణానికి వేసిన కంకర గుట్టలతో ఇబ్బంది పడుతున్నామని, నల్లజర్ల మండలం అనంతపల్లికి చెందిన ఎం.శ్రీనివాసరావు గ్రామంలో కోతుల బెడద అధికంగా ఉందని, అధికారులు స్పందించాలని కోరుతూ అర్జీలు అందించారన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఏళ్ల తరబడి అసంపూర్తిగా..

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాల కల నెరవేరడం లేదు. నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కేంద్రం-5కు సొంత భవనం నిర్మించాలని పనులు చేపట్టారు. సగం మేర భవన నిర్మాణం పూర్తి అయిన అనంతరం నిధులు చాలకపోవడంతో ఏళ్ల తరబడి భవనం అసంపూర్తిగా మిగిలిపోయింది. ఈ విషయాన్ని ఐసీడీఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా త్వరలో నిధులు వస్తాయని భవన నిర్మాణం పూర్తి చేస్తామని అంటున్నారు.

- న్యూస్‌టుడే, నిడదవోలు

రెయిలింగ్ లేక ప్రమాదాలు

నిడదవోలు మండలం సమిశ్రగూడెం వద్ద పశ్చిమడెల్టా ప్రధాన కాలువపై ఉన్న వంతెన రెయిలింగ్ కొంత మేర విరిగిపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ వంతెనపై నుంచి ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలకు చెందిన సగం మంది ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ వంతెన మధ్యలో కూడా పలుచోట్ల విరిగిపోయింది. దీనిని దృష్టిలో ఉంచుకుని ముందుగా వంతెన రెయిలింగ్‌కు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, నిడదవోలు





రాళ్లు తేలిన రహదారి

ఉండ్రాజవరం మండలంలోని తీపర్రు నుంచి చివటం వెళ్లే రహదారిపై రాళ్లు తేలి ప్రయాణానికి ఏమాత్రం అనుకూలంగా లేకపోవడంతో వాహన చోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయిదు గ్రామాల పరిధిలోని ఈ రహదారి గుంతలతో అధ్వానంగా తయారైంది. మరమ్మతులు చేయించాలని పరిసర గ్రామాల ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు. దీనిపై ఏఈ శ్రీనివాసును వివరణ కోరగా పరిశీలించి మరమ్మతు చేయిస్తామన్నారు.

- న్యూస్‌టుడే, ఉండ్రాజవరం

అసలే గుంతలు.. ఆపై మలుపు

నందిగూడెం-గుడ్డిగూడెం ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు చేరడంతో రాత్రి సమయంలో వాహనచోదకులు వాటిని గుర్తించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుంతలకు సమీపంలోనే పెద్ద మలుపు ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలకు ఆస్కారం కలుగుతోంది. రోడ్డు మార్జిన్లలో పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో రోడ్డు ఇరుకుగా మారుతోంది.

- న్యూస్‌టుడే, గోపాలపురం



ధూపదీప నైవేద్యాల కిట్లు పంపిణీ

నల్లజర్ల, న్యూస్‌టుడే: గ్రామ దేవతల ఆలయాలను పునరుద్ధరించుకుందాం.. మన దేశ సంస్కృతిని కాపాడుకుందాం అనే నినాదంతో దానధర్మ ఛారిటబుల్ ట్రస్ట్ సేవా ఫౌండేషన్ (తెలంగాణ) ఆధ్వర్యంలో రెండు రాష్ట్రాల్లోని ఎస్సీ, బీసీ కాలనీలోని ఆలయాలకు ధూపదీప నైవేద్యాల కిట్లు పంపిణీ చేస్తున్నట్లు నల్లజర్ల ధార్మిక మండలి సభ్యుడు పాతకోకల వెంకట్ తెలిపారు. సోమవారం మండలంలోని నల్లజర్ల, జగన్నాథపురం, మారెళ్లమూడి, తెలికిచెర్ల, కమతంగుంట, పుల్లలపాడు, ముసుళ్లగుంట గ్రామాలో ఆలయాలకు కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్తు నల్లజర్ల గ్రామశాఖ అధ్యక్షుడు మాయలేడి తాతారావు, భజరంగదళ్ మండల ఉపాధ్యక్షుడు సవలం రామకృష్ణ, గుదే వెంకట సుబ్బారావు, బొందల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు కొబ్బరిచెట్టు దగ్ధం

చాగల్లు, న్యూస్‌టుడే: కొవ్వూరు పట్టణంలో సోమవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. 22వ వార్డు పోతురాజుదిబ్బ వద్ద నివాసాల మధ్య ఉన్న కొబ్బరిచెట్టుపై పిడుగు పడడంతో దగ్ధమైంది. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. పిడుగు పడిన ప్రాంతం సమీపంలో ఒక భవనంలో పలు చోట్ల స్వల్ప బీటలు వచ్చినట్లు స్థానికులు తెలిపారు.

అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు

ఉండ్రాజవరం: మండలంలోని తణుకు, పాలంగి రహదారిలో సోమవారం కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పోలీసు అమరవీరుల త్యాగం చిరస్మరణీయం

న్యూస్‌టుడే బృందం: అపాయమని తెలిసినా ప్రజా రక్షణే ధ్యేయంగా తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగం చిరస్మరణీయమని కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా కొవ్వూరు పట్టణం, చాగల్లు పోలీసు స్టేషన్ల పరిధిలో సోమవారం భారీ ర్యాలీలు నిర్వహించారు. విద్యార్థులు, స్థానిక నాయకులు, పలు శాఖల అధికారులు పాల్గొని నివాళి అర్పించారు. పట్టణంలోని విజయవిహార్, బస్టాండ్, చాగల్లులోని ప్రధాన కూడళ్లలో విద్యార్థులు మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో పట్టణ, చాగల్లు ఎస్సైలు జగన్, కె.నరేంద్ర, గోదావరి మాత ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు. ● తాళ్లపూడి బజారు కూడలి నుంచి ప్రదర్శన నిర్వహించారు. ఎస్సై రామకృష్ణ, సిబ్బంది, ఆటోయూనియన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు. ● నిడదవోలులో ఆర్వోబీ వద్ద నుంచి ప్రధాన రహదారి, నంగాలమ్మ పూరిగుడి, గణపతి సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అక్కడ ఎస్వీడీ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సై శోభన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. ● ఎస్సై గుబ్బల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉండ్రాజవరంలో ప్రధాన రహదారి మీదుగా ప్రదర్శన నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు మాణిక్యాలరావు, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు. ● సీఐ నాగేశ్వర నాయక్ పర్యవేక్షణలో దేవరపల్లి, గోపాలపురం మండల కేంద్రాల్లో విద్యార్థులు పోలీసు సిబ్బంది భారీ ర్యాలీ చేపట్టారు. గోపాలపురం, దేవరపల్లి ఎస్సైలు సతీష్‌కుమార్, సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు. ● నల్లజర్ల ఎస్.ఆర్.కె కళాశాల విద్యార్థులు చెక్ పోస్టు సెంటర్ నుంచి ప్రధాన కూడలి వరకు ర్యాలీ చేశారు. సీఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



కొవ్వూరులో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ విశ్వం, తదితరులు



దేవరపల్లి సర్కిల్ పరిధిలో..



నిడదవోలు గణపతి కూడలిలో మానవహారం



యోగా పోటీలకు ఎంపికైన రాకేష్‌తో ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక

నిడదవోలు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి యోగా పోటీలకు నిడదవోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న దాసరి రాకేష్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు యు.గురునాథం, వ్యాయామోపాధ్యాయుడు ఎస్.నరసింహులు సోమవారం తెలిపారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఏలూరులో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. త్వరలో నెల్లూరులో జరిగే పోటీల్లో పాల్గొంటాడన్నారు. ఈ సందర్భంగా అతనిని అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ ఛైర్మన్ బి.దేవి, వైస్‌ఛైర్మన్ ఎం.రామకృష్ణ, ఎల్.సత్యనారాయణ, ఆర్ఎల్ శ్రీనివాసరావు, డి.పద్మజ తదితరులు పాల్గొన్నారు.

నీడ లేదు.. గోడు పట్టదు

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు పట్టణం ద్వితీయశ్రేణి పురపాలక సంఘం. పైగా నియోజకవర్గ ప్రధాన కేంద్రం. పట్టణ జనాభా సుమారు 43వేల పైచిలుకే. చుట్టుపక్కల 50 గ్రామాలకు పైగా ప్రజలు నిత్యం వివిధ పనుల నిమిత్తం నిడదవోలు వస్తుంటారు. అంతటి ప్రధానమైన ఈ పట్టణంలో బస్సుల కోసం వేచి ఉండేందుకు ప్రధాన కూడళ్లలో సైతం కనీసం షెల్టరులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో ప్రధానంగా సంతమార్కెట్, గణపతి కూడలిలో యర్నగూడెం, గణేష్ చౌక్‌కూడలి వెళ్లుటకు, గణేష్‌చౌక్‌కూడలి వద్ద రాజమహేంద్రవరం, పంగిడి రహదారులకు వెళ్లడానికి, ప్రధాన రహదారిలో రైల్వేగేటు వద్ద బస్‌షెల్టర్‌లు నిర్మించాల్సి ఉంది.



గణేష్‌చౌక్ కూడలిలో ఎండలోనే వేచి ఉన్న ప్రయాణీకులు

దుకాణాల ఎదుట వేచి ఉంటున్నారు..

నిత్యం చుట్టు పక్కల గ్రామాల నుంచి పాఠశాలలు, కళాశాలలకు అనేక మంది విద్యార్థులు వస్తుంటారు. వారంతా సాయంత్రం బస్సుల కోసం రహదారులపైనా, దుకాణాల ముందు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. యర్నగూడెం రహదారిలో అయితే బస్సు వచ్చేంత వరకు దుకాణదారుల పైనే ప్రయాణికులు ఆధారపడాల్సి వస్తుంది. గణేష్‌చౌక్‌కూడలి వెళ్లేందుకు వేచి ఉండే ప్రాంతంలో కనీసం నిల్చునేందుకు నిలువ నీడ లేదు. గణేష్‌చౌక్ కూడలిలో అయితే రాజమహేంద్రవరం, తణుకు, పాలకొల్లు, నరసాపురం వైపునకు వెళ్లేందుకు నిత్యం ప్రయాణికులు వచ్చి వేచి ఉంటారు. పంగిడి, పోలవరం, తాళ్లపూడి, దేవరపల్లి వెళ్లే ప్రయాణీకులు కూడా ఎండలోనే వేచి ఉండాల్సిన పరిస్థితి.



గణపతి కూడలిలో పరిస్థితి..